
అయినా డబ్బులేవి జగన్?



పోలింగ్ ముందు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసేందుకు ప్రభుత్వం తహతహ

ఈసీ వద్దన్నా కోర్టుకెళ్లిన అధికారులు

ఎన్నికల తర్వాత వేయమంటే పట్టించుకోని వైనం

ఏం జరిగింది: మే మొదటి వారం వరకు ఈ పథకాలకు నిధులు జమ కాలేదు. 13న పోలింగ్‌కు ముందుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. దీనికి ఎన్నికల సంఘం అభ్యంతరం చెప్పింది. అధికారులేమో న్యాయస్థానానికి వెళ్లారు. 10వ తేదీన డబ్బులేయాలని షరతులతో అనుమతి పొందారు. దీనిపైన ఈసీ అభ్యంతరం చెబుతూ.. ఎన్నికలు అయిపోయాక వెంటనే నిధులు జమ చేయొచ్చంటూ న్యాయస్థానానికి తెలిపారు.

వైసీపీ చేసిన ప్రచారం: ప్రతిపక్షాలు కుట్ర చేసి 10వ తేదీన నగదు జమను ఆపడంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులు అప్పులుచేసి సర్టిఫికెట్లు తెచ్చుకుంటున్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ అందకుండా రైతులు అవస్థలు పడుతున్నారు. మహిళలూ ఇబ్బంది పడుతున్నారు.

వాస్తవం: బటన్ నొక్కింది జనవరి.. మార్చి నెలల్లో. విద్యార్థులు, రైతులు, మహిళలకు అండగా నిలవాలని అనుకుంటే వెంటనే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయొచ్చు కదా? కోడ్ వస్తుందని తెలిసీ ఎందుకు పట్టించుకోలేదు. ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న కుయుక్తితో పోలింగ్ నాలుగైదు రోజుల ముందు తెరపైకి తెచ్చారు.

చిత్తశుద్ధి ఎంత?: ఓట్ల పండుగ సోమవారం ముగిసింది. మంగళవారం నుంచి లబ్ధిదారులకు డబ్బు జమ చేయడానికి ఎలాంటి అడ్డంకి లేదు. కానీ, మంగళవారం లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బు పడలేదు. ఇదంతా చూస్తుంటే లబ్ధిదారులమీద చూపిన ప్రేమంతా.. ఓట్ల కోసమేనని అర్థమైపోయింది. పోలింగ్ దాటిపోయాక ఇంక ఎప్పుడు వేస్తే ఏముందిలే అనుకున్నట్లున్నారు. ప్రభుత్వ తీరుపై విద్యార్థులు, రైతులు, మహిళలు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



బటన్ నొక్కింది

'ఆసరా' కోసం జనవరి 23వ తేదీన.. విద్యా దీవెనకు మార్చి 1న.. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కోసం మార్చి 6న.. చేయూతనివ్వడానికి మార్చి 7న.. ఈబీసీ నేస్తం కోసం మార్చి 15న సీఎం జగన్ బటన్లు నొక్కారు. ఆయా రోజుల్లో సభలు పెట్టారు. విపక్షాలపై విమర్శలు గుప్పించారు. రూ.వందల కోట్లతో ప్రకటనలు ఇచ్చారు.

ఎంతమందికి.. ఎంత లబ్ధి?

విద్యాదీవెన: ఫీజు రీయింబర్స్‌మెంటును విద్యా దీవెనగా పేరు మార్చారు. డిసెంబరులో జగన్ బటన్ నొక్కగా.. జిల్లాలోని 35114 మంది విద్యార్థుల 31979 మంది తల్లుల ఖాతాల్లో ఇంకా రూ.20.94 కోట్లు పడాల్సి ఉంది. మార్చి ఒకటిన మరోసారి త్రైమాసికానికి 34133 మంది విద్యార్థుల 30912 మంది తల్లుల ఖాతాల్లో రూ.33.29 కోట్లు రావాలి. ఈ రెండు విడతలకు రూ.54.23 కోట్లు ఇంకా రాలేదు.

చేయూత: ఈ పథకం ద్వారా జిల్లాలో 104,226 మంది మహిళలకు రూ.195.42 కోట్ల ఆర్థిక సాయం అందాల్సి ఉంది. ఒక్కో మహిళకు ఈ పథకం ద్వారా రూ.18,750 రావాలి. రెండు నెలలుగా నిధులు జమ కాలేదు.

ఇన్‌పుట్ సబ్సిడీ: 2023 ఖరీఫ్ వర్షాభావం, డిసెంబరులో మిచాంగ్ తుపాను వల్ల పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలి. జిల్లాలో 4604 మంది రైతులకు రూ.2.78 కోట్లు రావాలి.

ఈబీసీ నేస్తం: ఈ పథకం కింద జిల్లాలోని 23,215 మంది లబ్ధిదారులకు రూ.34.82 కోట్లను జమ చేయాలి. మార్చి 15వ తేదీన సీఎం జగన్ కర్నూలు జిల్లా బనగానిపల్లెలో బటన్ నొక్కగా.. జిల్లాలో జేసీ శ్రీనివాసులు ఈ మొత్తానికి సంబంధించి మెగా చెక్కును విడుదల చేశారు. ఆ నిధులు ఇంకా జమ కాలేదు.

ఆసరా: నాలుగో విడత ఆసరా పథకం ద్వారా లబ్ధిదారులకు నిధులు విడుదల చేస్తున్నట్లు జనవరి 23న అనంతపురం జిల్లా ఉరవకొండలో సీఎం జగన్ బటన్ నొక్కారు. జిల్లాలోని 33,655 డ్వాక్రా సంఘాలకు చెందిన 310,643 మందికి రూ.324 కోట్లు విడుదల కావాలి.

● తెల్లవారుజామున 3 వరకు

ఎస్.బండపల్లెలో పోలింగ్



ఎస్.బండపల్లెలో సోమవారం అర్ధరాత్రి దాటాక..

వి.కోట, మే 14: వి.కోట మండలం ఎస్.బండపల్లెలో మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు పోలింగ్ ముగిసింది. సోమవారం ఉదయం ఈవీఎంలలో మాక్ పోల్ నిర్వహించి పోలింగ్ ప్రారంభించే సరికి గంట ఆలస్యమైంది. అప్పటికే పెద్ద ఎత్తున ఓటర్లు బారులు తీరారు. ఈవీఎంల వినియోగంపై వృద్ధులకు సరైన అవగాహన లేకపోవంతో వారికి మరొకరు సహకరించడం తదితర కారణాలతో నెమ్మదిగా ఓటింగ్ ప్రక్రియ సాగింది. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ గడువు ముగిసే సమయానికి 212, 213 పోలింగ్ కేంద్రాలో 400 మందికి పైగా ఓటర్లు క్యూలో ఉన్నారు. వీరికి టోకెన్లు ఇచ్చి పోలింగ్ కొనసాగించారు. 213వ పోలింగ్ కేంద్రంలో రాత్రి 10 గంటలకు పోలింగ్ ముగిసింది. 212 కేంద్రంలో అర్ధరాత్రి 12 గంటలకు వీవీప్యాడ్ స్విచ్ ఆఫ్ అయింది. అప్పటికి 50 మందికిపైగా ఓటర్లు ఉన్నారు. మరో వీవీప్యాడ్‌నును మంగళవారం తెల్లవారు జామున 1.30 గంటలకు అమర్చారు. తెల్లవారు జామున 3 గంటలకు పోలింగ్ పూర్తి చేశారు. అప్పటి వరకు ఓటర్లు ఓపిగ్గా ఉండి మరీ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం 5.30 గంటలకు ఈవీఎం బాక్సులను స్ట్రాంగ్ రూంకు తరలించారు. మొత్తానికి 212లో 1291 ఓట్లకు 1144 ఓట్లుపోలై 86.6 శాతం, 213లో 1252 ఓట్లకు 1120 89.4 శాతం పోలింగ్ నమోదైంది.

హమ్మయ్య.. రీ పోలింగ్ లేదు

చిత్తూరు కలెక్టరేట్, మే 14: జిల్లాలో చెదురుముదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా పోలింగ్ ముగియడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. కొన్నిచోట్ల అర్ధరాత్రి వరకు పోలింగ్ కొనసాగడం తప్పితే ఎక్కడా రీ పోలింగ్ పరిస్థితి ఎదురుకాలేదు. పుంగనూరు, కుప్పం, పలమనేరుల్లో ఘర్షణలు జరిగి రీ పోలింగ్ రావచ్చని అధికారులు భావించారు. కానీ, అలాంటి ఘటనలు చోటుచేసుకోలేదు. ఎక్కడా నేతలు, అభ్యర్థుల నుంచి కూడా రీ పోలింగ్ కావాలంటూ ఆర్వోలకు ఫిర్యాదులు అందలేదు. మంగళవారం ఎస్వీసెట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల పరిశీలకులు పార్లమెంటు, ఏడు అసెంబ్లీ స్థానాల ఆర్వోలతో సమావేశాన్ని నిర్వహించారు. పీవో డైరీ, ఇతర పోలింగ్ సరళి గురించి తెలుసుకున్నారు. ఎక్కడా రీ పోలింగ్ అవసరం లేదంటూ పరిశీలకులు అధికార పూర్వకంగా ప్రకటించారు.

ఓటోత్సాహం దేనికి సంకేతం?

నియోజకవర్గాల వారీగా ఓటింగ్ ఇలా..				
నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైనవి	మహిళలు	పురుషులు
పుంగనూరు	238,868	206,916	104,717	102,196
నగరి	202,574	176,399	90,316	86,078
జీడీనెల్లూరు	204,949	181,779	90,971	90,805
చిత్తూరు	202,850	164,788	84,278	80,493
పూతలపట్టు	220,999	193,730	97,767	95,962
పలమనేరు	267,896	235,476	117,862	117,614
కుప్పం	225,775	202,920	101,608	101,306
మొత్తం	15,63,911	13,62,008	687,519	674,454

- జిల్లాలో 2.07 శాతం పెరిగిన పోలింగ్
- 2019లో 85.02%, ఇప్పుడు 87.09%
- అత్యధికంగా కుప్పంలో 89.88%
- అత్యల్పంగా చిత్తూరులో 81.24%
- ఓటేసిన మహిళలు 687,519.. పురుషులు 674,454



చిత్తూరు జిల్లాలో 2019 ఎన్నికల కన్నా 2.07 శాతం ఎక్కువ ఓట్లు పోలయ్యాయి. 2019లో 85.02 శాతం పోలవగా ఇప్పుడు 87.09 శాతం నమోదైంది. పోలింగ్ పెరుగుదల దేనికి సంకేతమనే అంశంపై భిన్న అంచనాలు పార్టీల నుంచి వినిపిస్తున్నాయి. 2019లో పోలింగ్ పెరుగుదలను ప్రభుత్వ వ్యతిరేకతగా చెప్పుకున్న వైసీపీ, ఇప్పుడు అదే పెరుగుదలను ప్రభుత్వ అనుకూలతగా చెప్పడం విశేషం. సహజంగా పోలింగ్ పెరుగుదల ఎప్పుడైనా ప్రభుత్వ వ్యతిరేకతనే ప్రతిబింబిస్తుంది. సోమవారం ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులుతీరి నిలబడ్డారు. రాత్రి పది గంటల దాకా కొన్ని చోట్ల పోలింగ్ కొనసాగింది. ఎర్రటి ఎండలోనూ జనం ఎగబడి ఓట్లేశారు. ఉత్సవాలకు హాజరైనట్లుగా జనం పోలింగ్ కేంద్రాలకు వచ్చారు. ఈ ఓటోత్సాహమే పార్టీలను పైకి ఎన్ని చెప్పినా లోలోన ఆందోళన పరుస్తోంది. ఈసారి క్యూల్లో మహిళలు పెద్ద సంఖ్యలో కనిపించారు. వృద్ధులు కూడా ఉత్సాహంగా వచ్చి ఓట్లు వేశారు. ఇదంతా జగన్ పథకాల సంతృప్తికి సంకేతం అని వైసీపీ చెబుతుండగా, చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పట్ల ఆశ, నమ్మకమే ఈ ఉత్సాహం అని టీడీపీ అంచనా కడుతోంది. జూన్ 4న కానీ అసలు కత తేలదు.

2019, 2024 ఎన్నికల పోలింగ్ (శాతాల్లో)		
నియోజకవర్గం	2024	2019
పుంగనూరు	86.62	85.15
నగరి	87.08	86.22
జీడీనెల్లూరు	88.69	86.45
చిత్తూరు	81.24	79.27
పూతలపట్టు	87.66	85.92
పలమనేరు	87.90	86.12
కుప్పం	89.88	85.43
మొత్తం	87.09	85.02

అత్యధికం కుప్పంలో

అన్ని నియోజకవర్గాల్లోనూ పోలింగ్ శాతం 80 దాటింది. ఈసారి అత్యధికంగా కుప్పంలో 89.88%, అత్యల్పంగా చిత్తూరులో 81.24% నమోదైంది. కుప్పంలో 4.45 శాతం పెరుగుదల చంద్రబాబుకు భారీ ఆధిక్యతకు సూచన అని భావిస్తున్నారు. 2019లో అత్యధికంగా జీడీనెల్లూరులో 86.45%, అత్యల్పంగా చిత్తూరులో 79.27% ఓట్లు పోలయ్యాయి. ఎప్పటిలాగే ఈ ఎన్నికల్లోనూ మహిళల నిర్ణయం కీలకం కానుంది. మహిళా ఓటర్లు అధికంగా ఉండగా.. అనుగుణంగానే 13,065 మంది మహిళలు పురుషుల కంటే అధికంగా పోలింగ్‌లో పాల్గొన్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి/చిత్తూరు కలెక్టరేట్

పెట్టెల్లో భవితవ్యం

● స్ట్రాంగ్ రూములకు చేరిన ఈవీఎంలు



ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లకు కలెక్టర్ షన్మోహన్ ఆధ్వర్యంలో సీళ్లు



స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచిన పోల్డ్ ఈవీఎంలు

చిత్తూరు కలెక్టరేట్, మే 14: అభ్యర్థుల భవితవ్యం ఈవీఎం పెట్టెల్లో నిక్షిప్తమైంది. ఆయా ఓటర్ల నిర్ణయాన్ని తమలో దాచుకున్న చిత్తూరు పార్లమెంటు, ఏడు అసెంబ్లీ స్థానాలకు సంబంధించి ఈవీఎంలు.. చిత్తూరు నగరం ఎస్వీసెట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు చేరాయి. సోమవారం రాత్రి 10 గంటల నుంచి ఈవీఎంలు రావడం మొదలైంది. రాత్రంతా చిత్తూరు, పూతలపట్టు, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల ఈవీఎంలు చేరుకోగా, మంగళవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో పుంగనూరు, మధ్యాహ్నం నగరి, సాయంత్రం 7 గంటల ప్రాంతంలో పలమనేరు, రాత్రి 9 గంటలకు కుప్పం నియోజకవర్గ ఈవీఎంలు చేరాయి. వీటన్నింటిని ఎన్నికల పరిశీలకులు.. అధికారులు పరిశీలించిన తర్వాత ఆయా నియోజకవర్గాల స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించారు. అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలకు వేర్వేరుగా ఈవీఎంలను భద్రపరిచారు. అనంతరం అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎన్నికల సాధారణ పరిశీలకుడు షాదిక్ అలామ్ పర్యవేక్షణలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ నేతృత్వంలో స్ట్రాంగ్ రూమ్‌లకు సీళ్లు వేశారు. వీరి వెంట అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, జేసీ శ్రీనివాసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఆయా స్ట్రాంగ్‌రూమ్‌లకు వెంటిలేటర్లు, విండోలనూ సీల్ చేశారు. ప్రతి స్ట్రాంగ్ రూమ్‌కు రెండు తాళాలు వేశారు. ఒకటి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వద్ద, రెండోది ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల వద్ద ఉంటాయి. కౌంటింగ్ జరిగే జూన్ 4వ తేది వరకు ఇద్దరు తహసీల్దార్లు, రిటర్నింగ్ అధికారులు వీటిని పర్యవేక్షిస్తారు. జిల్లా యంత్రాంగం అన్ని స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఫైర్ సేఫ్టీ జాగ్రత్తలను తీసుకున్నారు.

పటిష్ట బందోబస్తు

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీసు ఫోర్సు, స్టేట్ పోలీసు ఫోర్సుచే పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈవీఎం, వీవీప్యాట్ల స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కేంద్ర బలగాలను మోహరించారు.ఆయా స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు.కౌంటింగ్ కేంద్రాలు,స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద రౌండ్ ది క్లాక్ సీసీ కెమెరాలతో నిఘా పెట్టారు. 144 సెక్షన్‌ను అమల్లోకి తెచ్చారు.

అందరికీ ధన్యవాదాలు

చిత్తూరు కలెక్టరేట్, మే 14: 'జిల్లాలో ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు' అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'జిల్లాలో 1771 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించాం. ప్రతి కేంద్రంలోనూ వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశాం. జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్‌నుంచి సోమవారం సాయంత్రం వరకు పర్యవేక్షించాం. ప్రశాంతంగా ఎన్నికలు జరగడానికి పరిశీలకులు, వివిధ శాఖల అధికారులు, పోలింగ్ సిబ్బంది, కేంద్ర బలగాలతో పాటు ఓటర్లు, రాజకీయ పార్టీల సహకారం ఎంతో ఉంది. వీరందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నా. అధికారులు, సిబ్బంది ఇదే స్ఫూర్తితో పనిచేసి జూన్ 4న ఓట్ల లెక్కింపు విజయవంతం చేస్తాం' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్వీసెట్‌లోని స్ట్రాంగ్‌రూముల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ఈవీఎంలను భద్రపరుస్తున్నట్లు తెలిపారు.



ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.5

పాఠకుని పూర్తి పేరు : ....
డోరు నెంబరు : .... వీధి పేరు : ....
గ్రామం/పట్టణం : .... మండలం : ....
జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

చిత్తూరు ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. తిరుపతి				
2. శ్రీకాళహస్తి				
3. సత్యవేడు				
4. గంగాధర నెల్లూరు				
5. చంద్రగిరి				
6. పీలేరు				
7. మదనపల్లి				
8. తంబళ్లపల్లె				
9. పుంగనూరు				
10. పలమనేరు				
11. కుప్పం				
12. చిత్తూరు				
13. పూతలపట్టు				
14. నగరి				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

షరతులు వర్తిస్తాయి

ఆంధ్రజ్యోతి కార్యాలయం, సర్వే నెం. 717 బి/5, తూకివాకం గ్రామం & పోస్టు, రేణిగుంట మండలం, తిరుపతి జిల్లా - 517520, ఆం.ప్ర.

వైసీపీ బరితెగింపు

మహిళా వర్శిటీ ప్రాంగణంలో పులివర్తి నానీపై హత్యాయత్నం

దాడులు, ప్రతిదాడులు... వాహనాల ధ్వంసం.. బైక్ దహనం.. గాల్లోకి కాల్పులు... లాఠీఛార్జి... పలువురికి గాయాలు



దాడి చేస్తున్న వైసీపీ కార్యకర్త



నానీపై హత్యాయత్నం సమాచారంతో మహిళా వర్సిటీకి వందలాదిగా చేరుకున్న టీడీపీ శ్రేణులు.. గాయపడిన నానీకి ఉపచారాలు

తిరుపతి, మే 14 (ఆంధ్రజ్యోతి) : చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై జరిగిన దాడితో మంగళవారం తిరుపతి పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయ ప్రాంగణం రణరంగంగా మారింది. దాడులు, ప్రతిదాడులు, వాహనాల ధ్వంసం, బైక్ దగ్ధం, గాల్లోకి కాల్పులు, లాఠీఛార్జీలు వంటి ఘటనలతో ప్రశాంతతకు మారుపేరైన మహిళా వర్శిటీ ప్రాంతం అట్టుడికిపోయింది. వందలాదిమంది వైసీపీ, టీడీపీ మద్దతుదార్ల దాడులు, ప్రతిదాడులతో గంటల పాటు వర్శిటీ ప్రాంగణం, పరిసరాల్లో ఉద్రిక్తతలు రాజ్యమేలాయి.

మధ్యాహ్నం 3.22 గంటలకు

మహిళా విశ్వవిద్యాలయంలోని స్ట్రాంగ్ రూముల నుంచీ వెనుదిరిగి వస్తున్న పులివర్తి నానీ వాహనాలపై వైసీపీ వర్గీయులు బీరు బాటిళ్ళు, కర్రలు, ఇనుప రాడ్లు, సుత్తులతో దాడి చేశారు. వాహనాలు ధ్వంసం చేశారు. నానీని గాయపరిచారు. గన్‌మ్యాన్ గాల్లోకి కాల్పులు జరిపినా వెనక్కు తగ్గకుండా దాడులకు తెగబడడంతో గన్‌మ్యాన్ ధరణి కూడా తీవ్రంగా గాయపడ్డారు.

3.35 గంటలకు: దాడి నుంచీ తేరుకున్న నానీ అనుచరులు ఆయన్ను తీసుకుని వర్శిటీ మెయిన్ గేటు దాటి వెలుపలికి వచ్చి రోడ్డుపై బైఠాయించారు. అరగంట పాటు ధర్నా నిర్వహించి నానీని స్విమ్స్‌కు తరలించారు.

సాయంత్రం 4.10 గంటలకు: పెద్ద సంఖ్యలో మహిళా వర్శిటీలోకి చేరుకున్న టీడీపీ శ్రేణులు రాళ్ళు, ఇనుప రాడ్లతో ప్రతిదాడికి దిగారు. వైసీపీ వర్గీయులకు చెందిన కారును ధ్వంసం చేశారు. ఆవరణలో ఆందోళనకు దిగారు.

4.30గంటలకు: అలిపిరి సీఐ రామచంద్రారెడ్డి వాహనంలో లోపలికి రాగా వాహనాన్ని చుట్టుముట్టి పోలీసు వైఫల్యంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీఐ వాహనం దిగి దూరంగా వెళ్ళగా వాహనాన్ని ధ్వంసం చేశారు.

5గంటలకు: చంద్రగిరి నియోజకవర్గవ్యాప్తంగా భారీ సంఖ్యలో టీడీపీ మద్దతుదారులు వర్శిటీలోకి దూసుకొచ్చారు. పోలీసు తీరును నిరసిస్తూ వర్శిటీ ఎదుట ఆందోళనకు దిగారు.

5.15గంటలకు: ఇద్దరు ఏఎస్పీలు, డీఎస్పీలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. టీడీపీ వర్గీయుల ఆందోళన మరింత తీవ్రతరమైంది.

5.20గంటలకు: బీఎస్ఎఫ్ పోలీసులు రబ్బర్ బుల్లెట్లతో గాల్లోకి కాల్పులు జరిపారు. పోలీసులు లాఠీఛార్జి జరిపి చెదరగొట్టేందుకు యత్నించారు.

5.30 గంటలకు: వైసీపీ స్టిక్కర్ వున్న మొబైల్ చేతిలో పట్టుకుని బైక్‌పై వచ్చిన యువకుడిని ఆందోళనకారులు చితకబాది బైక్‌ను తగులబెట్టారు.

5.45 గంటలకు: మహిళా వర్శిటీ వద్దకు చేరుకున్న టియర్ గ్యాస్ వాహనాలు, కేంద్ర సాయుధ బలగాలు. వచ్చీ రాగానే లాఠీఛార్జి చేసి ఆందోళన కొనసాగిస్తున్న టీడీపీ వర్గీయులను చెదరగొట్టి తరిమివేశారు. లాఠీఛార్జిలో పదిమంది గాయపడ్డారు. అందులో ఐదుగురు మీడియా ప్రతినిధులున్నారు.

6గంటలకు: ఘటనా స్థలానికి ఎస్పీ రాక. టీడీపీ అభ్యర్థి, అతడి గన్ మ్యాన్ క్షేమంగా వున్నారని, స్ట్రాంగ్ రూమ్ సైతం భద్రంగా వుందని మీడియాకు స్పష్టం చేశారు. అభ్యర్థిపై జరిగిన దాడిలో పాల్గొన్న నిందితులను గుర్తించామని, గంటలోగా అరెస్టు చేస్తామని వెల్లడించారు.



సుత్తితో వీర విహారం.. కారు దిగి వెళుతున్న నాని.. లాఠీచార్జి

భీతావహంగా వర్సిటీ ప్రాంగణం

పగిలిన బీరు బాటిళ్ళు, రాళ్ళు, విరిగిపోయిన కర్రలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడివున్నాయి. నానీ వాహనాలు, వైసీపీ వర్గీయుల వాహనం, పోలీసు వాహనం ధ్వంసమయ్యాయి. నానీ వాహనాల్లో ప్రత్యర్థులు దాడి సందర్భంగా వదిలిపెట్టిన రాళ్ళు, ఉనుప సుత్తి వంటివి పడున్నాయి. వీటితో వర్సిటీ ఆవరణ భీతావహంగా మారింది.

పోలీసు వైఫల్యంతోనే టీడీపీ అభ్యర్థిపై దాడి

సోమవారం పోలింగ్ సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో తలెత్తిన ఘటనలతో టీడీపీ, వైసీపీ వర్గాల నడుమ ఉద్రిక్తతలు పెరిగిపోయాయి. వీటి తీవ్రతను అంచనా వేయడంలో పోలీసులు దారుణంగా తప్పటడుగు వేశారు. దాడులు, ప్రతిదాడులు జరిగే అవకాశముందన్న కనీస ఆలోచన గానీ, వాటిని అడ్డుకునే కనీస ప్రయత్నం గానీ చేయలేదు. రెండు పార్టీల సామాజిక మాధ్యమాల మీద కన్నేసేవారు. వారి కదలికల సమాచారం షాడో పార్టీల ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకుని ఇలాంటి ఘటనలను నిలువరించే వీలుండేది. ఈ విషయంలో పోలీసులు దారుణంగా విఫలమైనట్టు కనిపిస్తోంది. ఇక, మహిళా వర్శిటీ ఆవరణలోని ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల వద్ద కాపలా వున్న పోలీసులు ఘటనా స్థలానికి రావడంతో నానీపై దాడికి పాల్పడిన వైసీపీ వర్గీయులు పరారయ్యారు. ఒకవేళ వాళ్ల సకాలంలో రాకుంటే నానీ, అతడి అనుచరుల పరిస్థితి ఏమైవుండేదన్న ప్రశ్న భయం గొలుపుతోంది. వైసీపీ వర్గీయులు రాళ్ళు, కర్రలు, ఇనుప రాడ్లు, సుత్తులు వంటివి వెంట తెచ్చుకుని దాడికి దిగిన తీరు వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తోంది.



వేగంగా స్పందించని పోలీసులు

నానీపై దాడి జరగ్గా ఆయన సతీమణి సుధారెడ్డి సామాజిక మాధ్యమాల్లో అటు పోలీసులకు, ఇటు టీడీపీ శ్రేణులకు వెంటనే రావాలని పిలుపిచ్చారు. నియోజకవర్గంలో ఎక్కడెక్కడో వున్న టీడీపీ కార్యకర్తలు వందలమంది అరగంటలో మహిళా వర్శిటీకి చేరుకోగా పోలీసు బలగాలు మాత్రం సకాలంలో రాలేదు. దానివల్లే ఐదారు వందలమంది టీడీపీ మద్దతుదారులు వర్శిటీ ఆవరణలోకి ప్రవేశించి ప్రతి దాడులకు పాల్పడ్డారు. చివరికి పోలీసు వాహనం కూడా వారి దాడిలో ధ్వంసమైంది. దీనికి కూడా పోలీసు వైఫల్యమే కారణంగా కనిపిస్తోంది.

స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత డొల్లతనం బట్టబయలు

మహిళా వర్శిటీ ఆవరణలోని ఇంజనీరింగ్ విభాగం గదుల్లో ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. అక్కడ మూడంచెల భద్రత కల్పించామని కలెక్టర్, ఎస్పీ స్వయంగా వెల్లడించారు. తొలి అంచెలో అంటే గదుల వద్ద సీఐఎస్ఎఫ్ బలగాలు, రెండవ అంచెలో అంటే భవనం వెలుపల సాయుధ బలగాలు, మూడవ అంచెలో సాధారణ పోలీసులు, హోమ్‌గార్డులు కాపలా వుంటారని చెప్పారు. ఎన్నికల అధికారులను, అభ్యర్థులను, వారి జనరల్ ఏజెంట్లను అది కూడా వారి ఐడీలను తనిఖీ చేశాకే లోనికి అనుమతించాల్సి వుండగా 150మందికి పైగా వైసీపీ కార్యకర్తలు వాహనాల్లో వర్శిటీ ఆవరణలోకి ఎలా రాగలిగారన్నది ప్రశ్న. అంతమంది యధేచ్ఛగా మారణాయుధాలతో లోనికి వచ్చి టీడీపీ అభ్యర్థి వాహనాలను ధ్వంసం చేసి అభ్యర్థిపైన, గన్‌మ్యాన్‌పైనా దాడి చేయడం కలకలం సృష్టించింది.ఇదే సాధ్యమైనప్పుడు స్ట్రాంగ్ రూముల్లోని ఈవీఎంలను యంత్రాంగం ఎంతవరకూ కాపాడగలదన్న ప్రశ్న తలెత్తుతోంది.

ప్రధాన నిందితులు గణపతి, భాను?

పులివర్తి నానీ, ఆయన గన్‌మెన్ ధరణిపై దాడికి సంబంధించి సీసీ ఫుటేజీ, అక్కడున్న కారు వివరాలను పోలీసులు సేకరించినట్లు తెలిసింది.రామచంద్రాపురం జడ్పీటీసీ డిల్లీరాణి భర్త భానుకుమార్ రెడ్డి, నడవలూరు సర్పంచ్ గణపతి రెడ్డితో పాటు దాదాపు 50మంది దాకా దాడి ఘటనలో పాల్గొన్నట్లు సీఐ మురళీకృష్ణ గుర్తించారు. ఘటనా స్థలంలో వైసీపీ కండువాలను, ఇతర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా, నాని, ఆయన గన్‌మెన్ క్షేమంగా ఉన్నారని, దాడికి పాల్పడిన వారిని త్వరలో పట్టుకుంటామని తిరుపతి ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ చెప్పారు.

అర్ధరాత్రి తోటలకు, డ్రిప్ సిస్టమ్‌కు నిప్పు

రూ.2.7 లక్షల ఆస్తి నష్టం ● వైసీపీ పనేనని బాధితుల ఆరోపణ



బూరుగుమాకులపల్లెలో మామిడిచెట్లకు పెట్టిన నిప్పు - బల్లలో ధ్వంసమైన డ్రిప్‌సిస్టమ్

రామకుప్పం, మే 14: రామకుప్పం మండలం చెల్దిగానిపల్లె పంచాయతీ బూరుగుమాకులపల్లె, పంచాయతీకేంద్రమైన బల్లలో సోమవారం అర్ధరాత్రి ప్రత్యర్థుల తోటలకు, వ్యవసాయ పరికరాలకు నిప్పు పెట్టారు. దీనివల్ల రూ.2.70 లక్షల ఆస్తి నష్టం కలిగినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. బూరుగుమాకులపల్లెలో సుదీర్ఘకాలం టీడీపీలో ఉన్న రామేగౌడ కొన్ని నెలల కిందట వైసీపీలో చేరారు. వైసీపీ శ్రేణుల మధ్య ఇమడలేక ఆయన ఇటీవల తిరిగి టీడీపీలోకి వచ్చేశారు. ఆ పార్టీ తరపున ప్రచారంలోనూ పాల్గొన్నారు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి అతడి మామిడి చెట్లకు, టమోటా తోటలో ఏర్పాటు చేసే ఆసరా కర్రలకు, డ్రిప్‌పరికరాలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. మామిడి చెట్లు కాలిపోగా.. పక్కనే ఉన్న అరటి తోటలోని సుమారు 50చెట్లు వాడిపోయాయి. ఆసరా కర్రలు, రెండు కట్టల డ్రిప్‌పైపులు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.70 వేల ఆస్తి నష్టం వాటిల్లింది. తాను టీడీపీలో చేరానన్న అక్కసుతోనే వైసీపీకి చెందినవారే ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని బాధిత రైతు వాపోయారు.

● అలాగే, బల్ల గ్రామంలో మునస్వామి కుమారులు వెంకటాచలం, చంద్రశేఖర్, శ్రీకాంత్ తమ గ్రామంలోని 95వ బూత్‌లో టీడీపీ తరపున ఏజెంట్లుగా ఉన్నారు. పోలింగ్ సందర్భంగా వీరు వైసీపీ వారు ఎటువంటి అక్రమాలు పాల్పకుండా నిక్కచ్చిగా వ్యవహరించారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం వెంకటాచలం పొలం వద్ద గల పూరిగుడిసె, బోరు మోటారు స్టార్టరు ప్యానెల్‌కు దుండగులు నిప్పు పెట్టారు. పూరిగుడిసె, స్టార్టరు ప్యానెల్, అందులోని పరికరాలు, 300 మీటర్ల కేబుల్‌వైర్, డ్రిప్‌పరికరాలు కాలిపోయాయి. వీటి విలువ రూ.2లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపారు. తాను, తన సోదరులు టీడీపీ ఏజెంట్లుగా ఉండటాన్ని భరించలేక వైసీపీ శ్రేణులే కక్షతో ఈ చర్యకు పాల్పడి ఉంటారని వెంకటాచలం ఆరోపిస్తున్నారు.

పోలింగ్ కేంద్రంలో వైసీపీకి వ్యతిరేకంగా కూర్చుంటావా?

● పుంగనూరులో బీజేపీ ఏజెంట్‌కు రౌడీషీటరు బెదిరింపు

పుంగనూరు, మే 14: 'పుంగనూరులో వైసీపీకి వ్యతిరేకంగా పోలింగ్ బూత్‌లో ఏజెంట్‌గా కూర్చుంటావా? నీకెంత ధైర్యం? నువ్వు ఎక్కడ ఉంటే అక్కడికి వచ్చి లేదా నీ ఇంటికి వచ్చి కొట్టి నరకం చూపిస్తా' అంటూ పుంగనూరులో బీజేపీ ఏజెంట్ వివేకానందను వైసీపీకి చెందిన రౌడీషీటరు చెంగాలపురం సూరి ఫోన్‌లో హెచ్చరించాడు. ఈ మేరకు మంగళవారం బాధితుడు వివేకానంద ఫోన్ కాల్ రికార్డింగ్‌తో ఎస్పీ, పుంగనూరు పోలీసులు, ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన ప్రకారంకథనం మేరకు వివరాలు.. పుంగనూరు పట్టణం చెంగాలాపురంలోని తోట వివేకానంద సోమవారం రహ్మత్‌నగర్ పోలింగ్ స్టేషన్ 49లో బీజేపీ రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తరపున ఏజెంట్‌గా ఉన్నారు. ఆ రాత్రి వివేకానందకు వైసీపీకి చెందిన రౌడీషీటర్ చెంగలాపురం సూరి ఫోన్ చేసి కాల్‌రికార్డు చేయాలని చెప్పి బెదిరించాడు. 'నీకు సపోర్టు ఎవరూ రారు. ఏమి చేసినా అడ్డొచ్చే మీ నాయకులెవరు? నాపైన ఇప్పటికే 20 కేసులు ఉన్నాయి' అంటూ తీవ్రస్థాయిలో దుర్భాషలాడాడు. కాగా, శ్రీకాకుళం నుంచి సైకిల్ యాత్రగా వస్తున్న టీడీపీ కార్యకర్తలను సుగాలిమిట్టలో బట్టలు ఊడదాయించి దాష్టికానికి పాల్పడిన చెంగలాపురం సూరినే.. ఇప్పుడు వివేకానందను బెదిరించారు.

ఎమ్మెల్సీ భరత్‌పై మరో రెండు ఫిర్యాదులు

రామకుప్పం, మే 14: ననియాలలో పోలింగ్ సందర్భంగా చోటు చేసుకున్న పరిణాల నేపథ్యంలో ఎమ్మెల్సీ భరత్‌పై మరో ఇద్దరు టీడీపీ కార్యకర్తలు సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదులు ఇచ్చారు. వీరి ఫిర్యాదుల మేరకు వివరాలు.. టీడీపీ బీసీసెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కుమారుడు చరణ్ సాయి ఓటువేసేందుకు వెళ్తుండగా ఎమ్మెల్సీ భరత్, అతని గన్‌మెన్, వైసీపీ మండల కన్వీనర్ బాబురెడ్డి, ననియాలతాండాకు చెందిన నాగరాజునాయక్, బధ్యానాయక్, సతీష్ హేళనగా మాట్లాడారు. అతడిని పిలిచి చితకబాదారు. హనుమంతు అనే వ్యక్తి ఓటువేసేందుకు వెళ్తుండగా కులం పేరుతో దూషించారు. దీనిపై ప్రశ్నించిన హనుమంతుపైనా దాడి చేశారు. ఈ మేరకు వీరిద్దరూ తమకు న్యాయం చేయాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సోమల మండలంలో 5 ఎన్నికల కేసులు

సోమల, మే 14: సోమల మండలంలో సోమవారం పలు పోలింగ్ కేంద్రాల వద్ద జరిగిన ఘర్షణలతో 5 కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట నరసింహులు మంగళవారం తెలిపారు. ఆవులపల్లె పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ, టీడీపీ కార్యకర్తలు క్యూలైన్ వద్ద ప్రచారం చేస్తున్నారని పరస్పరం ఘర్షణ పడ్డారు. ఈఘర్షణలో మల్లేశ్వరంపురానికి చెందిన టీడీపీ కార్యకర్త గిరి నాయుడు గాయపడ్డారు. ఆయన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. వైసీపీ వర్గం వారు ఫిర్యాదుతో మరో కేసు నమోదు జరిగింది. కందూరు హైస్కూల్ వద్ద జరిగిన వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో టీడీపీకి చెందిన మాజీ సర్పంచు ఓబులేసు, నౌషాద్ గాయపడడంతో వేర్వేరుగా ఫిర్యాదు చేయడంతో రెండు కేసులు, వైసీపీ వర్గానికి చెందిన గాలి సురేశ్‌రెడ్డి గాయపడి ఫిర్యాదుతో కేసులు నమోదు చేశారు.

వైసీపీకి ప్రచారం చేసిన ఆర్టీసీ డ్రైవరు సస్పెన్షన్

పలమనేరు, మే 14: కుప్పం ఆర్టీసీ డిపోలో డ్రైవరుగా పనిచేసే మున్నా అలియాస్ ఎస్ఏ బాషాను కుప్పం డిపో మేనేజర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పలమనేరులోని గంటావూరు ఇందిరమ్మకాలనీలో వీరు నివాసం ఉంటున్నారు. ఈయన భార్య పలమనేరులో వైసీపీ మున్సిపల్ కౌన్సిలర్. ఈనెల ప్రారంభంలో మున్నా అలియాస్ ఎస్ఏ బాషా వైసీపీ తరపున ఎన్నికల ప్రచారంలో నిర్వహించారు. దీనిపై ఈనెల 4వతేది ఆంధ్రజ్యోతిలో 'వైసీపీ ప్రచారంలో ఆర్టీసీ ఉద్యోగి' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై కుప్పం డిపో మేనేజర్ విచారణ జరిపి వైసీపీ ప్రచారంలో మున్న పాల్గొన్నట్లు నిర్ధారించుకొని సస్పెండ్ చేశారు.

బాపలనత్తంలో టీడీపీపై దాడి

● నలుగురికి గాయాలు.. పోలీసులకు ఫిర్యాదు



తీవ్రంగా గాయపడిన కేశవులు, నందగోపాల్ - దాడిలో ఓ ఇంటి వరండాలో పడిన రాళ్లు

బైరెడ్డిపల్లె, మే 14: బైరెడ్డిపల్లె మండలం బాపలనత్తం గ్రామంలో సోమవారం రాత్రి టీడీపీ వారిపై వైసీపీ శ్రేణులు దాడి చేశారు. ఈ ఘటనలో కేశవులు, నందగోపాల్, పురుషోత్తం, టీడీపీ బూత్ ఏజెంట్ బాబు గాయపడ్డారు. బాధితులు తెలిపిన ప్రకారం.. నెల్లిపట్లలో పోలింగ్ ప్రక్రియ ముగిశాక తమ స్వగ్రామం బాపలనత్తంకు బయలుదేరారు. వైసీపీ శ్రేణులు దారికాచి.. తమను అడ్డగించి దాడిచేసి గాయపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ అర్ధరాత్రి గ్రామంలో తమ ఇళ్లపై రాళ్లతో దాడిచేసి ఇళ్ల ముందు గేట్లు, వరండాలో పైకప్పుషీట్లు ధ్వంసంచేసి భయభ్రాంతులకు గురిచేశారన్నారు. దాడిలో గాయపడిన వారిని చికిత్స కోసం సోమవారం రాత్రి పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా తీవ్రంగా గాయపడిన కేశవులును మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. నందగోపాల్, పురుషోత్తం పలమనేరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలింగ్‌కేంద్రం వద్ద వైసీపీశ్రేణులు ఓటర్లను ప్రలోభపెడుతుండడంతో తాను అభ్యంతరం తెలపడంతో ఈ దాడికి పాల్పడ్డారని, దీనిపై విచారణజరిపి తమపై దాడిచేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని టీడీపీ బూత్ ఏజెంట్ బాబు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘర్షణకు సంబంధించి టీడీపీ శ్రేణులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైసీపీకి చెందిన ఆరుగురిపై కేసున మోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. తమపై టీడీపీ శ్రేణులు దాడికి పాల్పడ్డారని వైసీపీ వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. బైరెడ్డిపల్లెలో ఘర్షణలకు సంబంధించి వైసీపీ, టీడీపీకి చెందిన 8 మందిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

జగన్ పాలనపై ఉన్న

కసితోనే పెరిగిన ఓట్ల శాతం

● మాజీ మంత్రి అమరనాథరెడ్డి స్పష్టీకరణ



మాట్లాడుతున్న మాజీ మంత్రి అమరనాథరెడ్డి

పలమనేరు, మే 14: జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనపై ప్రజల్లో ఉన్న కసి కారణంగానే ఈ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగిందని మాజీ మంత్రి అమరనాథరెడ్డి అభిప్రాయపడ్డారు. పలమనేరులోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఓటు హక్కు వినియోగంపై ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా ఇంత శాతం రాలేదు. కానీ, జగన్ పాలన కారణంగా ఇంత ఓటింగ్ శాతం వచ్చింది. ఆయనకూ కృతజ్ఞతలు తెలియజేయాలి' అని అన్నారు. పలమనేరు నియోజకవర్గంలో గత చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున పోలింగ్ శాతం జరిగిన సందర్భంలేదన్నారు. విదేశాల నుంచీ వచ్చి ఓటేయడమనేది ఆలోచించాల్సిన విషయమన్నారు. 'అర్బన్ ఏరియాల్లో ఎప్పుడూ 50నుంచి 62 శాతం మేరకు పోలయ్యేవి. అలాంటిది 80 నుంచి 90 శాతం పోలింగ్ జరగింది. అదీ పొద్దున 6గంటలకే పోలింగ్ బూత్‌లవద్దకు ఓటర్లు వచ్చారంటే ఏదోఒక మెసేజ్ తీసుకురావాలనే ఆలోచన వారిలో ఉంది. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అంతమంది ఓటేశారు. పోలింగ్ సరళి చూస్తే ఈ ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత ఉందో అర్థమవుతుంది' అని పేర్కొన్నారు. ఓటు హక్కు వినియోగించుకొన్న ప్రతిఒక్కరికీ.. ఎన్నికల కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, ఓటర్లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు బాలాజి, గిరిబాబు, ఖాజాపీర్, శ్రీధర్, శ్రీనివాసులు, రహీం, చెన్నరాయప్ప, పురుషోత్తం, మహేష్, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

నాగమవాండ్లపల్లెలో గజదాడులు



భజనబండ వద్ద ఏనుగులు నాశనం చేసిన వరి పంట

ఐరాల, మే 14: ఐరాల మండలం నాగమవాండ్లపల్లెలో ఏనుగుల గుంపు సోమవారం రాత్రి పది ఎకరాలలో పంటలను నాశనం చేశాయి. నాగమవాండ్లపల్లె సమీపం భజనబండ వద్ద ఏనుగులు పంట పొలాలపై దాడికి దిగాయి. వరి పంటకు నీళ్ల వదలడానికి వెళ్లిన రైతులు ఏనుగులను చూసి భయభ్రాంతులకు గురయ్యారు. గ్రామస్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందించగా సుమారు పది మంది సంఘటనా స్థలానికి విచ్చేసి రేకు డబ్బాలతో శబ్ధం చేసినా ప్రయోజనం లేకపోయింది. దీంతో అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా వారు ఎన్నికల విధులలో ఉన్నట్లు తెలియజేయడంతో రైతులు ఏమి చేయలేక పోయారు. ఏనుగుల దాడిలో రంగమ్మచెరువుకు చెందిన రఫీ,ఖయ్యూంల రెండెకరాలు, నాగమవాండ్లపల్లెకు చెందిన కె.దేవరాజులు, ఎస్.దేవరాజులు, ఎన్.రాఘవేంద్ర,బి.రమేష్, డి.బాబు, వెదర్లపల్లెకు చెందిన సుధాకర్‌కు సంబంధించిన వరి పంటను ఏనుగుల గుంపు తొక్కి నాశనం చేశాయి. ఏనుగుల గుంపు సమీపంలోని అటవీప్రాంతంలో తిష్ట వేసినట్లు సమాచారం.

1290 ఎకరాల్లో దెబ్బతిన్న ఉద్యాన పంటలు

చిత్తూరు (సెంట్రల్), మే 14: జిల్లాలో ఈనెల మొదటి వారంలో కురిసిన వర్షాలకు జిల్లాలోని 1290 ఎకరాల్లో 926 మంది రైతులు సాగు చేసిన ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు ఆ శాఖ అధికారులు లెక్కలు కట్టారు. పంట నష్టం రూ.3.79 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. దెబ్బతిన్న పంటల్లో ప్రధానంగా 1060 ఎకరాల్లో మామిడి పంట దెబ్బతింది. పంట నష్టం అంచనా రూ.1.93 కోట్లుగా లెక్కలు కట్టారు. అరటి 90 ఎకరాలు, పప్పాయి 22.5 ఎకరాలు, టమోటా 70 ఎకరాలు, వేరుశెనగ 5 ఎకరాలు కాగా కొబ్బరి ఇతర పంటలు దెబ్బతిన్నాయి. పంట నష్టం అంచనాలను ప్రభుత్వానికి నివేదించినట్లు ఉద్యాన అధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

కాపురానికి రాలేదని భార్యపై హత్యాయత్నం

● తల, చేతులపై కత్తితో నరికిన భర్త

● బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు



చికిత్స పొందుతున్న స్వాతి

యాదమరి, మే 14: కాపురానికి రాలేదనే కోపంతో భార్యపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ దాడిలో గాయపడిన తల్లిని చూసిన కుమార్తె 108కు సమాచారం ఇచ్చి ఆస్పత్రికి చేర్పించారు. ఈ ఘటన మంగళవారం యాదమరి మండలంలో చోటుచేసుకుంది. సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. గుడిపాల మండలం పేయనపల్లెకు చెందిన ఉమాపతి(34) ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే మండలం చీలాపల్లెకు చెందిన వరుసకు మేనత్త కుమార్తె అయిన స్వాతి(25)ని పదేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నాడు. వీరి కుటుంబం ప్రస్తుతం చిత్తూరు నగరంలోని జానకారపల్లెలో నివాసముంటోంది. కొంతకాలంగా ఆర్థిక సమస్యలతో పాటు భార్యపై అతడికి అనుమానం పెరిగింది. ఈ కారణాలతో కొన్నేళ్లుగా ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ నేపథ్యంలో ఉమాపతి కొద్దిరోజులుగా యాదమరి మండలం ముత్తరపల్లె వద్ద పనులు చేసుకుంటూ ఎక్స్‌కవేటర్ షెడ్డు వద్దే ఉన్నాడు. మంగళవారం ఇంటి నుంచి స్వాతి తన కుమార్తె సదాశ్రీతో కలిసి భర్త పనిచేస్తున్న షెడ్డువద్దకు వెళ్లింది. అక్కడ నుంచి పక్కనే ఉన్న బస్టాప్ వద్దకు చేరుకున్నారు. బస్టాప్ వద్ద ఇద్దరి మధ్య మరోసారి వాగ్వాదం జరిగింది. మాటమాట పెరిగి తీవ్రస్థాయికి చేరడంతో చికెన్ నరికే కత్తితో భార్య తలపై, చెయ్యిపై విచక్షణారహితంగా నరికాడు. దాంతో కళ్లెదుటే తల్లి అపస్మారక స్థితిలో పడిపోవడాన్ని చూసిన కుమార్తె సదాశ్రీ రోదిస్తూ వెంటనే తన ఫోన్ నుంచి 108కు సమాచారం ఇచ్చింది. వెంటనే వచ్చిన 108వాహనం బాధితురాలిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు. స్వాతి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉమాపతిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి పరారీలో ఉన్నాడని, త్వరలో పట్టుకుంటామని సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపారు.

బోయకొండ ఆలయ కార్యాలయంలో అగ్నిప్రమాదం

● విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ కారణం



అగ్నికి ఆహుతైన బోయకొండ కార్యాలయం

చౌడేపల్లె, మే14: బోయకొండ ఆలయ కార్యాలయంలో మంగళవారం వేకువజామున అగ్నిప్రమాదం జరిగింది. కొండపై ఆలయ సమీపంలో పిడుగులు పడ్డాయి. ఈ క్రమంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి కార్యాలయంలో మంటలు చెలరేగాయి. ఆలయ సెక్యూరిటీ సిబ్బంది గుర్తించి మంటలు అదుపు చేశారు. అప్పటికే ఫర్నిచర్, ఏసీలు, కంప్యూటర్, ప్రింటర్, ఫ్యాన్లు, పీవోపీలు, డోర్‌లు, అద్దాలు, సీసీ కెమరాలతో పాటు పలు వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి.

టీడీపీ నాయకుడికి చంద్రబాబు దంపతుల పరామర్శ

రామకుప్పం, మే 14: టీడీపీ రామకుప్పం మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి తండ్రి మునస్వామిరెడ్డి అనారోగ్యంతో సోమవారం సాయంత్రం 3గంటలకు మృతి చెందారు. తండ్రి మృతిచెందినా పోలింగ్‌కు ఎలాంటి ఆటంకం కలగరాదని ఆనందరెడ్డి ఆ విషయాన్ని పార్టీ శ్రేణులకు తెలియజేయలేదు. మంగళవారం ఉదయం విషయం తెలుసుకున్న వెంటనే టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరీలు ఆనందరెడ్డిని ఫోన్‌లో పరామర్శించారు. ఆనందరెడ్డికి పార్టీ పట్ల ఉన్న నిబద్ధతను అభినందించారు. అండగా ఉంటామని భరోసానిచ్చారు. కాగా ఎమ్మెల్సీ కంచర్లశ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, పార్టీ కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జీ మునిరత్నం, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, పార్టీ మండల ప్రధానకార్యదర్శి నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ సీతాపతి, తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్ వెంకటాచలం తదితరులు మునస్వామిరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఫలితాల విశ్లేషణలతో బిజీబిజీగా నేతలు

పుంగనూరు, మే 14: పుంగనూరు నియోజకవర్గంలో ఎన్నికల పోలింగ్ ముగియడంతో గెలుపు, మెజార్టీలపై రాజకీయ నాయకులు ఫలితాల విశ్లేషణలతో బిజీగా ఉన్నారు. వైసీపీ అభ్యర్థిగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టీడీపీ అభ్యర్థిగా చల్లా రామచంద్రారెడ్డిలు, రాజంపేట పార్లమెంట్ స్థానానికి బీజేపీ తరఫున నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, వైసీపీ అభ్యర్థిగా ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి పోటీ చేశారు. ఎన్నికల తంతు సోమవారం రాత్రి వరకు కొనసాగడంతో మంగళవారం నుంచి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు ఎన్నికల్లో గెలుపు, మెజార్టీ గురించి ఎవరికి తోచిన విధంగా వారు లెక్కలు కడుతున్నారు. పోలింగ్ సరళి, మహిళలు, యువత, వృద్ధులు ఇలాపోలైన ఓట్లు, పోలింగ్ స్టేషన్ల వారీగా సమీక్షిస్తున్నారు. ఎవరికి వారు తమ పోలింగ్ బూత్‌లో, పంచాయతీలో, మండలంలో ఇన్ని ఓట్లు తమ పార్టీకి వస్తాయని లెక్కలు తీసి అధినాయకులకు వివరాలు తెలియజేస్తున్నారు. ఎన్నికల ప్రచారాలు, పోలింగ్‌లో కష్టపడిన పార్టీల శ్రేణులు, నాయకులకు అభ్యర్థులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. పుంగనూరు నియోజకవర్గంలోని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు కలికిరిలో కిరణ్‌కుమార్‌రెడ్డిని, రొంపిచెర్లలోని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డిని కలిసి పోలింగ్ జరిగిన విధానాన్ని వివరించారు. అలాగే వైసీపీ శ్రేణులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డిలకు పోలింగ్ గురించి తెలియజేశారు.

గంగజాతరకు చాటింపు పూజలు


గరిగను ఊరేగిస్తున్న ఉత్సవ నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్, మే 14: నగరంలో ఈనెల 21, 22న నిర్వహించే నడివీధి గంగమ్మజాతర సందర్భంగా మంగళవారం సాయంత్రం చాటింపు పూజలు నిర్వహించారు. గంగజాతర మహోత్సవ వంశపారంపర్య ధర్మకర్తలు నీకే లావణ్యబాబు, నీకే సాయికృష్ణారెడ్డిలు గిరింపేట చెంగల్‌రాయ కొండ మునీశ్వరుల ఆలయం వద్ద అమ్మవారి గరిగకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ నుంచి ఊరేగింపుగా గంగినేని చెరువు కట్ట వద్దనున్న కరిమారియమ్మ ఆలయానికి వచ్చి గరిగకు పూజలు చేసారు. అనంతరం మేళతాళాలతో ఊరేగింపుగా పొన్నియమ్మ ఆలయానికి వచ్చి అమ్మవారి గరిగకు హారతి ఇచ్చి ప్రతిష్ఠించారు. అనంతరం నడివీధి గంగమ్మ పాదాన్ని ఊరేగింపుగా బజారు వీధి గంగమ్మను ప్రతిష్ఠించే ప్రదేశానికి తీసుకెళ్ళి అక్కడ ఉత్సవ భూమి పూజలు చేసారు. ఈ కార్యక్రమాల్లో ఉత్సవ నిర్వాహకులు హేమంత్ కుమార్, వెంకటేష్, గుణశేఖర్, రాము, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

వి.కోటలో 86.48 శాతం పోలింగ్

వి.కోట, మే 14: వి.కోట మండల పరిధిలో ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది. మండల పరిధిలో 70 పోలింగ్ కేంద్రాలో 86.48 శాతం పోలింగ్ నమోదైంది. 70655 మంది ఓటర్లు ఉండగా 61103 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వి.కోట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో 20 పోలింగ్ కేంద్రాలో 19612 ఓటర్లకుగాను 15250 మంది ఓటు హక్కు వినియోగించుకుని 77.75 శాతం పోలింగ్ నమోదైంది. పాపేపల్లె పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 93.67 శాతం పోలింగ్ నమోదైంది. వి.కోట టౌన్ పరిధిలోని 172 పోలింగ్ కేంద్రంలో అత్యల్పంగా 62.3 శాతం పోలింగ్ నమోదైంది.

మాదే మెజారిటీ..కాదు మాదే..!

తమకంటే తమకే మెజారిటీ వస్తుందని అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. పదివేల ఓట్లకు పైగా మండలంలో మెజారిటీ వస్తుందని మంగళవారం సాయంత్రం వైసీపీ వారు ముందస్తు బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. అయితే ఈ సారి ప్రజలు మార్పు కోరుకుంటున్నారని మండలంలో తిరిగి టీడీపీ ఏడు వేల పైచిలుకు ఓట్లు మెజారిటీ సాధిస్తుందని ఆ పార్టీ నాయకులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ వారిపై కేసు నమోదు

హనుమేపల్లి పోలింగ్ కేంద్రంలో వైసీపీ నాయకులు కేంద్రం వద్దే ఓట్లు అభ్యర్థిస్తున్నారని టీడీపీ వర్గీయులు నిలదీశారు. దీంతో ఇరు వర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘటనపై వైసీపీ వారు చేసిన ఫిర్యాదు మేరకు టీడీపీ వర్గీయులపై సీఐ లింగప్ప కేసు నమోదు చేశారు. మండలంలో చెదురుమదురు ఘటనలు మినహా అన్నిచోట్లా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు ముగిశాయి.

పుంగనూరులో 86.62 శాతం పోలింగ్

- ఓటింగ్‌లో పాల్గొన్న 2,06,916 మంది ఓటర్లు
- పురుషులకంటే 2,521 మంది మహిళలు

పుంగనూరు, మే 14: పుంగనూరు నియోజకర్గంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో 2,06,916 మంది ఓటు హక్కు వినియోగించు కున్నారు. 86.62 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలోని పుంగనూరు అర్బన్, రూరల్, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల్లో సోమవారం రాత్రి 11గంటల వరకు పోలింగ్ జరిగింది. పుంగనూరులో 1,17,072మంది పురుషులు, 1,21,791 మంది మహిళలు, ఐదుమంది ఇతరులతో కలిపి మొత్తం 2,38,868 మంది ఓటర్లున్నారు. పురుషులు 1,02,196 మంది, మహిళలు 1,04,717 మంది, ఇతరులు ముగ్గురు కలిపి మొత్తం 2,06,916 ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషుల కంటే 2,521మంది మహిళలు అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా 2019లో జరిగిన ఎన్నికల్లో 2,29,261 మందికి గాను పురుషులు 97,483 మంది, 97,735 మంది స్త్రీలు, ఇద్దరు ఇతరులు కలిపి మొత్తం 1,95,220 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 85.15 శాతం ఓటింగ్ జరిగింది. అప్పట్లో కూడా 252 మంది మహిళలు అధికంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. గత ఎన్నికల కంటే సోమవారం జరిగిన ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగింది. 262 పోలింగ్ కేంద్రాల్లోని 265 పోలింగ్ బూత్‌లలోని ఈవీఎంలను చిత్తూరు ఎస్వీసెట్ కాలేజీ స్ట్రాంగ్ రూమ్‌కు తరలించినట్లు ఎన్నికల అధికారి వై.మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న మోటార్‌సైకిల్

- ముగ్గురు యువకులకు తీవ్రగాయాలు
- తమిళనాడు రాణిపేట సీఎంసీకి తరలింపు

గంగాధరనెల్లూరు, మే 14: మోటారుసైకిల్ వెళుతున్న ముగ్గురు యువకులు వారికి ముందుగా వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ ముగ్గురు యువకులను తమిళనాడు రాణిపేట సీఎంసీకి తరలిం చిన ఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. శ్రీరంగరాజుపురం మండలం యు.ఎం.పురం (ఉద్దండ మహారాజపురం) గ్రామానికి చెందిన ఆనందనాయుడు కుమారుడు చంటి (21), ప్రభాకర్ నాయుడు కుమారుడు చందు(19)లు పుత్తూరు లో బీటెక్ చదువుతుండగా. ఇదే గ్రామానికి చెందిన గిరి కుమారుడు సోమనాథ్(19) పాండిచ్చేరిలో బీటెక్ చదువుతున్నాడు. వీరు ముగ్గురు కలిసి యు.ఎం.పురం నుంచి ఒకే మోటారు సైకిల్‌లో చిత్తూరుకు వెళ్ళి, తిరిగి స్వగ్రామానికి వస్తూ, చిత్తూరు-పుత్తూరు ప్రధాన రహదారి గంగాధరనెల్లూరు మండలం పెద్దకాల్వ పంచాయతీ ఎల్లమరాజుపల్లె బస్టాప్ సమీపంలో వారికి ముందుగా వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈప్రమాదంలో చంటి, చందు, సోమనాథ్‌లకు తీవ్రగాయాలు కాగా వారిని స్థానికులు చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి వారిని తమిళనాడు రాణిపేట సీఎంసీ ఆసుపత్రికి తరలించారు.

యువకుడి ఆత్మహత్య


విజయ్ (ఫైల్‌ఫొటో)

గుడిపాల, మే 14: మండలంలోని కుప్పిగానిపల్లెలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.... కుప్పిగానిపల్లె దళితవాడకు చెందిన యేసుకు మైఖేల్, విజయ్‌లు కుమారులు. మూడ్రోజుల క్రితం మైఖేల్ తన తమ్ముడు విజయ్ ప్రవర్తన సరిగ్గాలేకపోవడంతో మందలించాడు. దీంతో అలిగి నరహరిపేట చెక్‌పోస్టులోని తన అవ్వగారి ఇంటికి వెళ్ళిపోయాడు. దీంతో మంగళవారం అక్కడ ఎవ్వరికీ కనబడకపోవడంతో చుట్టుపక్కల వెతికితే... చెక్‌పోస్టు ఎదురుగా గల అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరివేసుకుని ఉన్నాడు. దీంతో గుడిపాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

దళితనాయకుడిపై దాడిచేసిన వారిని అరెస్టు చేయాలి

పలమనేరు, మే14 : వి.కోట మండలానికి చెందిన దళితనాయకుడు శివరాంపై దాడిచేసిన అగ్రవర్ణాల వారిని వెంటనే అరెస్టుచేయాలని ఇక్కడి మానవహక్కుల సంఘం నాయకులు డిమాండు చేశారు. ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకొంటున్న ప్రభుత్వ భూమిని అగ్రవర్ణాలకు చెందిన వారు అక్రమంగా జేసీబీతో వ్యవసాయ మోటర్లు ధ్వంసం చేశారని ఈ దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరారు. ఈ సమావేశంలో మానవహక్కుల సంఘం నాయకులు డీవీ మునిరత్నం, వేలాయుధం, వినోద్‌కుమార్, పార్థసారధి, సాంబశివయ్య, రవికుమార్, హరిబాబు, వెంకటేష్ పాల్గొన్నారు.

మృత్యుంజయేశ్వరునికి మందహాసం వితరణ


మందహాసానికి పూజలు చేస్తున్న దాతలు రాధాకృష్ణ, శిరీషా దంపతులు

చౌడేపల్లె, మే14: స్థానిక బజారు వీధిలో వెలసిన మృత్యుంజయేశ్వరస్వామి ఆలయానికి రాధకృష్ణ, శిరీషా దంపతులు మందహాసం విరాళంగా ఇచ్చారు. మంగళవారం ఆలయ అర్చకులు నూతన మంద హసానికి దంపతులచే ప్రత్యేక పూజలు చేయించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివార్లను మందహాసంపై ఊరేగించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాత, మాజీ సర్పంచ్ పద్మావతమ్మ, భక్తులు పాల్గొన్నారు.

పెళ్లి కాలేదని ఆత్మహత్య



బంగారుపాళ్యం, మే 14: పెళ్ళి కాలేదని జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం తుంబ కుప్పంలో చోటుచేసుకుంది. ఈ గ్రామానికి చెందిన చంద్రమౌళి కుమారుడు భరత్‌కుమార్ ఎలక్ట్రీషియన్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. తనకు పెళ్ళికాలేదని మనస్తాపానికి గురై సోమవారం తన ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ మల్లప్ప తెలిపారు.

కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య



బంగారుపాళ్యం, మే 14: వడిశాకు తిని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం బంగారు పాళ్యం మండలంలో చోటు చేసుకుంది. కాటప్పగారిపల్లె గ్రామానికి చెందిన కన్నయ్య కుమారుడు కృష్ణమూర్తి తాపీ మేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఈయన కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతూ ఉండేవాడు. మంగళవారం ఉదయం వడిశాకు తిని అపస్మారక స్థితిలో పడివుండడంతో కుటుంబ సభ్యులు గమనించి చీలాపల్లి సీఎంసీకి తరలించగా చికిత్స పొందుతూ కృష్ణమూర్తి (42) మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ పళ్ళెమ్మ తెలిపారు.

అమరరాజా విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత

తవణంపల్లె: దిగువమాఘంలో గల అమరరాజా విద్యాలయం విద్యార్థులు సీబీఎస్‌ఈ టెన్త్, ఇంటర్ ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. పదో తరగతిలో ఉన్న 52 మంది, ఇంటర్‌లో న్న 57 మంది మొత్తం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ జయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు.

పులివర్తి నానిపై దాడి అమానుషం

చిత్తూరు, మే 14: చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిపై జరిగిన దాడి పిరికిపంద చర్య అని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, చిత్తూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్‌లు ఒక ప్రకటనలో ఖండించారు. మంగళవారం తిరుపతిలోని పద్మావతి యూనివర్సిటీలో ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్ వద్దకు వెళుతున్న పులివర్తి నానిపై పట్టపగలే రాళ్లతో, గొడ్డళ్లతో, ఇనుప సుత్తులతో దాడి చేయడం హేయమైన చర్య అని పేర్కొంది. ఒక ఎమ్మెల్యేగా ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థికే భద్రత లేకపోతే సామాన్య ప్రజలకు ఈ రాష్ట్రంలో ఏమి భద్రత ఉంటుందని పోలీసుశాఖ వారిని ప్రశ్నిస్తున్నామన్నారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

నానిపై దాడి హేయమైన చర్య : గురజాల

చిత్తూరు (సెంట్రల్), మే 14: చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివరి నానిపై జరిగిన దాడి హేయమైన చర్యని చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. వైసీపీ కుట్రపూరిత రాజకీయాలకు స్వస్తి పలికే రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఓటమి భయంతో వైసీపీ అభ్యర్థి, అతని తండ్రి, అనుచరులతో పులివర్తి నాని, అంగరక్షకుడిపై సుత్తి, గొడ్డలి, కొడవళ్ళతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో గెలుపు, ఓటములు సహజమని, దీన్ని జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు మారణాయుధాలతో పులివర్తి నానిపై దాడి చేయడం దారుణమని టీడీపీ రాష్ట్ర నాయకులు, టౌన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ షణ్ముగం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.

చంద్రబాబుదే ఘన విజయం!

- రాజీనామాకు సిద్ధమా? ● భరత్‌కు ఎమ్మెల్సీ కంచర్ల సవాల్
- ప్రజలకు, కార్యకర్తలకు ధన్యవాదాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

కుప్పం, మే 14: తెలుగుదేశం పార్టీ అధినేత, స్థానిక ఎమ్మెల్యే చంద్రబాబు కుప్పంలో లక్ష ఓట్ల మెజారిటీతో గెలువబోతున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ స్పష్టం చేశారు. ఆయన ఓడిపోతే తక్షణం ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి వెళ్లిపోతానని, ఒకవేళ భరత్ ఓడితే రాజీనామాకు సిద్ధమా అని సవాల్ విసిరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిత్నం, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్, పార్టీ మున్సిపల్, కుప్పం మండల అధ్యక్షులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్ తదితరులతో కలిసి కంచర్ల విలేకరులతో మాట్లాడారు. మండే ఎండల్లో సైతం తండోపతండాలుగా తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్న నియోజకవర్గ ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఇన్నాళ్లూ వైసీపీ ప్రభుత్వం, జగన్‌రెడ్డి అండ్ కో చేసిన అరాచకాలు, దౌర్జన్యాల మీద కసితోనే ప్రజలు వెల్లువలా తరలివచ్చి ఓటు వేశారన్నారు. ఇది రాబోయే కొత్త ప్రభుత్వానికి నాందిగా పేర్కొన్నారు. జూన్ 4న రాష్ట్రంలో ఏర్పడబోయేది టీడీపీ ప్రభుత్వమేనని స్పష్టంచేశారు. నియోజకవర్గంలో వైసీపీ నేతలు చేసిన అరాచకాలు, అన్యాయాలు, కార్యకర్తలు, ప్రజలపై చేసిన దాడులు అన్నింటికీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఎన్నికల వేళ రెండుమూడు నెలలుగా రాత్రనకా పగలనకా కష్టపడిన కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. పోలింగ్ రోజున అర్ధరాత్రి దాటినా కార్యకర్తలు సహనంతో పోలింగ్ కేంద్రాల వద్ద అరాచకాలు జరగకుండా కాపుకాశారని ప్రశంసించారు. కష్టపడిన ప్రతిఒక్కరికీ ఫలితం దక్కుతుందని కంచర్ల హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు సత్యేంద్రశేఖర్, డాక్టర్ వెంకటేశ్, కాణిపాకం వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కుప్పం ఓటింగ్‌లో మహిళా ప్రభంజనం


ఈవీఎంలను తరలించడానికి సిద్ధంగా ఉన్న కంటైనర్

కుప్పం, మే 14: కుప్పంలో ఓటర్లు పోటెత్తారు. రికార్డు స్థాయిలో ఏకంగా 89.88 శాతం పోలింగ్ నమోదు చేసి రికార్డు సృష్టించారు. అందులోనూ పురుషుల కంటే అధికంగా మహిళలే పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చి అత్యధికంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. కుప్పం నియోకవర్గంలో మొత్తం 2,25,75 మంది ఓటర్లున్నారు. మహిళా ఓటర్లు 1,13,247 మంది కాగా పురుష ఓటర్లు 1,12,519 మంది ఉన్నారు. ఇందులో ఈనెల 13వ తేదీన జరిగిన పోలింగ్‌లో ఏకంగా 2,02,920 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో మహిళా ఓటర్లు 1,01,608 మంది కాగా పురుష ఓటర్లు 1,01,306 మంది ఉన్నారు. అంటే పురుషుల కంటే 302 మంది మహిళలు అధికంగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే పోలింగ్ పర్సంటేజ్ కూడా గత 2019 ఎన్నికలతో పోలిస్తే ఈసారి 4.63 శాతం పెరిగింది. 2019లో కేవలం 85.25 శాతమే పోలింగ్ నమోదైంది. ఈ పెరిగిన ఓటింగ్ ఫలితం ఎలా ఉంటుందో జూన్ నెల 4వ తేదీన కానీ తేలదు. కాగా కుప్పంలోని ఎంఎఫ్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌కు చేరిన ఈవీఎంలను బుధవారం మధ్యాహ్నం ఇక్కడినుంచి కంటైనర్ ద్వారా పూర్తి స్థాయి బందోబస్తుతో జిల్లా కేంద్రమైన చిత్తూరులోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. నియోకవర్గ ఎన్నికల అధికారి జి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఇది జరిగింది.

వేడుకగా గంగజాతర చాటింపు


జూపల్లిలో విరూపాక్షమ్మకు పొంగళ్లు సమర్పిస్తున్న మహిళా భక్తులు

కల్లూరు, మే 14: పులిచెర్ల మండల కేంద్రంలోని గ్రామదేవత గంగమ్మతల్లి, పాళెం పంచాయతీ జూపల్లి విరూపాక్షమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం గంగజాతర చాటింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. గంగజాతరకు ముందు వచ్చే మంగళ వారం గ్రామదేవత ఆలయాల్లో చాటింపు వేడుకలు నిర్వహిస్తారు. ఇందులోభాగంగా ఆలయంలో ఉదయం అమ్మవారికి అభి షేకాలు, అర్చనలు, ప్రత్యేకపూజలు చేశారు. మహిళలు అమ్మవారికి పొంగళ్ల నైవేద్యంగా సమర్పిం చారు. వారం రోజులపాటు గంగజాతర వేడుకలు జరగనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకల్లో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

పుంగనూరులో గెలుపు ఖాయం: టీడీపీ


పోలింగ్ జరిగిన విధానంపై చర్చిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, ఏప్రిల్ 14: పుంగనూరు నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి గెలుపు ఖాయమని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం రొంపిచెర్లకు వచ్చిన పుంగనూరు, చౌడేపల్లి, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల నాయకులు, కార్యకర్తలతో మండలాల వారీ సమావేశం నిర్వహించారు. ఎన్నికల సరళి, ఓటర్లు ఎదుర్కొన్న సమస్య, తదితర అంశాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చల్లాబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోనూ, పుంగ నూరులోనూ టీడీపీ అధికారంలోకి వస్తుందన్నారు. జూన్ 4 తరువాత ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం ఖాయమన్నారు. ఓటింగ్‌కు సహకరించిన వారందరికీ ఆయన అభినందనలు తెలిపారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం


ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న ఆలయ అర్చకులు

చౌడేపల్లె, మే14: స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి బ్రహ్మోత్స వాలలో రెండవ రోజు మంగళవారం శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహిం చారు. ఉదయం స్వామి వారికి ఆలయ ప్రధానార్చకులు రాజశేఖర్ దీక్షితులు, కుమార, మహేష్ దీక్షితులు, చంద్రశేఖర్ స్వాములు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయంలోని ధ్వజస్తంభానికి పంచామృతాభి షేకాలు చేశారు. రాత్రి స్వామివారిని సింహవాహనంపై పుర వీధుల్లో మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. ధ్వజారోహణానికి పద్మ శాలీలు, సింహ వాహన సేవకు విశ్వబ్రాహ్మణులు ఉభయదారులుగా వ్యవహరించారు.

బస్సుల కోసం పడిగాపులు


బెంగళూరుకు వెళ్లేందుకు ఉదయం 4 గంటల నుంచి వేచి ఉన్న జనం

పలమనేరు, మే14 : పలమనేరులో మంగళవారం ఉదయం 4 గంటల నుంచి చిత్తూరు, బెంగళూరు వెళ్లేందుకు వందలాది మంది ప్రయాణికులు జాతీయరహదారిపై పడిగాపులుకాశారు. ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకొనేందుకు బెంగళూరు నుంచి వచ్చిన వారు, మరోవైపు పలమనేరు నుంచి చిత్తూరుకు వెళ్లేందుకు ప్రజలు బస్సులు లేకపోవడంతో గంటల కొద్దీ వేచి చూడాల్సి వచ్చింది. ఎన్నికల విధుల కోసం వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన పోలింగ్ సిబ్బంది సైతం బస్సుల కోసం ఎదురుచూడాల్సి వచ్చింది. దీంతో ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. పలమనేరులో ఆర్టీసీ డిపో ఉన్నా ప్రయాణికుల అవసరాల మేరకు బస్సులు నడిపి ఏళ్లు గడిచిపోతోంది. గతంలో ఇక్కడి డిపో నుంచి నడుస్తున్న బస్సులను ఇతర డిపోలకు పంపడంతో బస్సుల కొరత ఏర్పడింది. ఆర్టీసీ ఉన్నతాధికారులైనా స్పందించి ప్రయాణికుల రద్దీకి తగిన విధంగా బస్సులను నడపాలని ప్రజలు కోరుతున్నారు.

సోమలలో పెరిగిన పోలింగ్ శాతం

సోమల, మే 14: సోమల మండలంలో సోమవారం రాత్రి వరకు కొనసాగిన పోలింగ్ 85.10 ఓటింగ్ చేరుకుంది. 2019లో 76.54 శాతం నమోదైంది. పొదలగుంటపల్లెలో మధ్యాహ్నం వరకు మందకొడిగా సాగి అనంతరం ఓటరు రాత్రి 9.30 వరకు క్యూలైన్లలో ఉండి ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. టీ.ఎం గొల్లపల్లెలో రాత్రి 10 గంటల వరకు ఓటింగ్ కొనసాగింది.

పులిచెర్లలో 86.85 శాతం పోలింగ్

కల్లూరు, మే 14: పులిచెర్ల మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 86.85 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ వసంతలత తెలిపారు. మండలంలో మొత్తం ఓటర్లు 31771 మంది ఉండగా ఉన్నారు. వారిలో పురుషులు 13675, స్త్రీలు 13915, ట్రాన్స్‌జెండర్లు ఇద్దరు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నాయకుల వెంట పడ్డ ఓటర్లు

సోమల, మే 14: ఓటు హక్కును వినియోగించుకున్న కొందరు ఓటర్లు ఇరు పార్టీల కార్యకర్తలు, నాయకుల ఇళ్ల వద్దకు వెళ్లి తమకు నగదు పంపిణీ జరగలేదని ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరి కొందరు మందుబాబులు మద్యం కోసం నాయకుల వెంట పడ్డారు. కొందరు నాయకులు వారి ఒత్తిడి తట్టుకోలేక పోలింగ్ ముగియడంతో మాయమైనట్లు తెలిసింది.

సారా విక్రయిస్తే చర్యలు తప్పవు

సోమల, మే 14: సారా విక్రయాలు జరిపితే చర్యలు తప్పవని ఎస్‌ఐ వెంకట నరసింహులు హెచ్చరించారు. మంగళవారం తమ్మినాయనపల్లె పంచాయతీలో పలు చోట్లు సారా అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారంతో ఆయన సిబ్బందితో కలసి గ్రామస్తులతో ఆరా తీశారు. పలు పాత కేసుల్లో ఉన్న వ్యక్తుల వివరాలు సేకరించారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సర్పదోష నివారణ పూజలు



రామకుప్పం, మే 14: రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం సర్పదోష నివారణ పూజలు జరిగాయి. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు స్వామివారి దర్శనానికి ముందు సర్పదోష నివారణ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పురోహితులు నాగరాజశర్మ, కృష్ణమూర్తి, బాలాజీలు భక్తులచే సర్పదోష నివారణ పూజలు చేయించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలు, మజ్జిగ పంపిణీ చేశారు.

అమ్మవారికి మండలం పూజ



సదుం, మే 14: మండలంలోని తాటిగుంట పాళెం పాపిరెడ్డి గారిపల్లెలో వెలసిన గ్రామదేవత ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం మండలం పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రాత్రి విశేష అలంకరణలతో మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారిని ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు.

నేటి నుంచి నైతిక విలువలపై శిక్షణ

గంగవరం, మే 14: స్థానిక కళామందిరంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి విద్యార్థులకు నైతిక విలువలపై ఉచిత వేసవి శిక్షణ తరగతులు బుధవారం నుంచి నిర్వహిస్తామని సంస్థ అధ్యక్షులు తులసీనాథం నాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 11 గంటల వరకు పాఠశాల స్థాయి విద్యార్థులకు కథలు, ఆట పాటలు, పద్యాల ద్వారా నైతిక విలువలపై శిక్షణ ఇస్తామని వెల్లడిం చారు. పేర్లు నమోదు చేసుకున్న విద్యార్థులు శిక్షణకు హాజరుకావాలని ఆయన కోరారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

గంగజాతరకు చాటింపు పూజలు


గరిగను ఊరేగింపుగా తీసుకొస్తున్న ఉత్సవ నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్, మే 14: నగరంలో ఈనెల 21, 22న నిర్వహించే నడివీధి గంగమ్మజాతర సందర్భంగా మంగళవారం సాయంత్రం చాటింపు పూజలు నిర్వహించారు. గంగజాతర మహోత్సవ వంశపారంపర్య ధర్మకర్తలు సీకే లావణ్యబాబు, సీకే సాయికృష్ణారెడ్డిలు గిరింపేట చెంగల్‌రాయకొండ మునీశ్వరుల ఆలయం వద్ద అమ్మవారి గరిగకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ నుంచి ఊరేగింపుగా గంగినేని చెరువు కట్ట వద్దనున్న కరిమారియమ్మ ఆలయానికి వచ్చి గరిగకు పూజలు చేసారు. అనంతరం మేళతాళాలతో ఊరేగింపుగా పొన్నియమ్మ ఆలయానికి వచ్చి అమ్మవారి గరిగకు హారతి ఇచ్చి ప్రతిష్ఠించారు. అనంతరం నడివీధి గంగమ్మ పాదాన్ని ఊరేగింపుగా బజారువీధి గంగమ్మను ప్రతిష్ఠించే ప్రదేశానికి తీసుకెళ్ళి అక్కడ ఉత్సవ భూమి పూజలు చేసారు. ఈ కార్యక్రమాల్లో ఉత్సవ నిర్వాహకులు హేమంత్ కుమార్, వెంకటేష్, గుణశేఖర్, రాము, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పులివర్తి నానీపై దాడి అమానుషం : టీడీపీ

చిత్తూరు, మే 14: చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీపై జరిగిన దాడి పిరికిపంద చర్య అని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, చిత్తూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ ఒక ప్రకటనలో ఖండించారు. మంగళవారం తిరుపతిలోని పద్మావతి యూనివర్సిటీలో ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్ వద్దకు వెళుతున్న పులివర్తినానిపై పట్టపగలే రాళ్ళతో, గొడ్డళ్ళతో, ఇనుప సుత్తులతో దాడి చేయడం హేయమైన చర్య అని పేర్కొంది. ఒక ఎమ్మెల్యేగా ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థికే భద్రత లేకపోతే సామాన్య ప్రజలకు ఈ రాష్ట్రంలో ఏమి భద్రత ఉంటుందని పోలీసుశాఖ వారిని ప్రశ్నిస్తున్నామన్నారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

నానీపై దాడి హేయమైన చర్య : గురజాల

చిత్తూరు (సెంట్రల్), మే 14: చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీపై జరిగిన దాడి హేయమైన చర్య అని చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. వైసీపీ కుట్రపూరిత రాజకీయాలకు స్వస్తి పలికే రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఓటమి భయంతో వైసీపీ అభ్యర్థి, అతని తండ్రి, అనుచరులతో పులివర్తి నాని, అంగరక్షకుడిపై సుత్తి, గొడ్డలి, కొడవళ్ళతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో గెలుపు ఓటములు సహజమని, దీన్ని జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు మారణాయుధాలతో పులివర్తి నానిపై దాడి చేయడం దారుణమని టీడీపీ రాష్ట్ర నాయకులు, టౌన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ షణ్ముగం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.

దౌర్జన్యాలు చేయడం సబబు కాదు

గుడిపాల, మే 14: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీపై వైసీపీ నాయకులు దాడిచేయడం హేయమైన చర్య అని మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ టీడీపీ నాయకులను టార్గెట్ చేసుకుని దౌర్జన్యాలు చేయడం సబబు కాదని హెచ్చరించారు. వీరికి జూన్ 4న తగిన శాస్తి జరుగుతుందని హెచ్చరించారు.

నానీపై దాడి అమానుషం

పూతలపట్టు, మే 14: చంద్రగిరి నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిపై వైసీపీ మూకలు దాడిచేయడం అమానుషమని రాష్ట్ర టీఎన్‌టీయూసీ నేత యువరాజులు నాయుడు, మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, అధికార ప్రతినిధి గంగారపు గోపి, జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు హిమగిరి నాయుడు, మాజీ కన్వీనర్ ప్రతాపనేని చంద్రమౌళి, గుంటూరు మురళిలు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.

ఓటమి భయంతో దాడులు

పెనుమూరు, మే 14: ఎన్నికల్లో ఓటమి చెందుతామని తెలుసుకున్న వైసీపీ నాయకులు రాష్ట్రమంతా దాడులకు పాల్పడుతున్నారని పెనుమూరు మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, ప్రధాన కార్యదర్శి భాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తినానిపై దాడికి పాల్పడిన వైసీపీ నాయకులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

తప్పు చేసినవారు శిక్ష అనుభవించాల్సిందే : థామస్

శ్రీరంగరాజపురం, మే 14: తప్పు చేసిన వారు ఎవరైనా శిక్ష అనుభవించాల్సిందేనని టీడీపీ అభ్యర్థి థామస్ అన్నారు. మంగళవారం పుల్లూరు క్రాస్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ పుల్లూరులోని కాపులు, దళితవాడకు చెందిన యువకులు ఆదివారం క్రికెట్ ఆడుతూ ఘర్షణ పడ్డారని, దీంతో సోమవారం కొందరు కాపు యువకులు దళితవాడకు వెళ్లి ద్విచక్ర వాహనాలను దగ్ధం చేసి భయభ్రాంతులకు గురి చేశారన్నారు. దీనిపై పోలీసులు విచారించి వారిపై కేసు నమోదు చేశారని, దీనిని రాజకీయం చేయవద్దని థామస్ సూచించారు. గ్రామస్తులను పరామర్శించడానికి వస్తే పోలీసులు అడ్డుకోవడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పొన్న యుగంధర్, టీడీపీ మండలఅధ్యక్షుడు జయశంకర్‌నాయుడు, రాజశేఖర్ నాయుడు, బాలాజి నాయుడు, సుబ్రమణ్యంనాయుడు, నూరిరెడ్డి, హేమాద్రినాయుడు పాల్గొన్నారు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో
మంగళ విద్యాలయ విద్యార్థుల ప్రతిభ

పూతలపట్టు, మే 14: ఈనెల 13న విడుదల చేసిన సీబీఎస్‌ఈ 10, 12 తరగతుల పరీక్షా ఫలితాల్లో పేటమిట్టలో గల మంగళ విద్యాలయ విద్యార్థులు అధిక మార్కులు సాధించారు. ఈ ఏడాది పాఠశాల నుంచి 157 మంది పదో తరగతి విద్యార్థులు, 148 మంది ఇంటర్ విద్యార్థులు పరీక్షకు హాజరై వంద శాతం ఉత్తీర్ణతతో విజయం సాధించారు. పదో తరగతి విద్యార్థుల్లో 500 మార్కులకు గాను వెంకీ 479, పూజిత 478, మనోజ్ 477, సతీష్ 473, ఉదయశ్రీ 473 మార్కులు సాధించారు. అలాగే 12వ తరగతి విద్యార్థుల్లో ఎంపీసీ గ్రూపులో హేమప్రియ 500 మార్కులకు గాను 466, ఫణీంద్ర 459, జాస్మిత 427, శ్రుతిశ్రీ 461, హితేష్ కుమార్ 457 మార్కులు సాధించారు.

జీడీనెల్లూరులో 88.69 శాతం పోలింగ్

వెదురుకుప్పం, మే 14: గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో సోమవారం జరిగిన ఎన్నికల్లో 88.69 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ నియోజకవర్గ పరిధిలో 256 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 204949 మంది ఓటర్లు ఉండగా పురుషుల ఓటర్లు 101853, మహిళా ఓటర్లు 103090 మంది ఉన్నారు. ట్రాన్స్ జెండర్ ఓటర్లు ఆరుగురు ఉన్నారు. కాగా, సర్వీసు ఓటర్లు 475 మంది. వీరిలో పురుషులు 466, మహిళలు 9 మంది ఉన్నారు. పీడబ్ల్యూడీ ఓటర్లు 3582 మంది. వీరిలో 2126 మంది పురుషులు, 1456 మంది మహిళలు. 18 నుంచి 19 ఏళ్ల మధ్య ఉన్న ఓటర్లు 5094 మంది. వీరిలో పురుషులు 2841 మంది, మహిళలు 2253 మంది ఉన్నారు. 85 సంవత్సరాలు పైబడిన ఓటర్లు 951 మంది ఉండగా వీరిలో పురుషులు 373, స్త్రీలు 578 మంది ఉన్నారు. ఓవర్‌సీస్ (ఎన్‌ఆర్‌ఐ) ఓటర్లు 13మంది ఉన్నారు. మొత్తం 204949మందిలో 181777 మంది ఓటర్లు ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

వైభవంగా గంగజాతర

పాలసముద్రం, మే 14: మండలంలోని శ్రీబొమ్మరాజుపురం ఆదిఆంధ్రవాడ, శ్రీకావేరిరాజుపురం పంచాయతీలోని ఏటుగూరుపల్లె గ్రామాల్లో మంగళవారం గంగజాతర మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం ఆయా గ్రామాల్లో అంబళ్ళు పోసి, గరిగెను ఊరేగించారు. సాయంత్రం మహిళలు పొంగళ్ళు పెట్టారు. రాత్రికి అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో విద్యుత్ దీపాలతో అమ్మవారి కటౌట్లు ఏర్పాటు చేసి, వీధుల్లో విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

మృత్యుంజయేశ్వరుడికి మందహాసం వితరణ

చౌడేపల్లె, మే14: స్థానిక బజారు వీధిలో వెలసిన మృత్యుంజయేశ్వరస్వామి ఆలయానికి రాధకృష్ణ, శిరీషా దంపతులు మందహాసం విరాళంగా ఇచ్చారు. మంగళవారం అర్చకులు నూతన మంద హాసానికి దంపతులచే ప్రత్యేక పూజలు చేయించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివార్లను మందహాసంపై ఊరేగించనున్నట్లు తెలిపారు.

అమరరాజా విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత

తవణంపల్లె: దిగువమాఘంలో గల అమరరాజా విద్యాలయం విద్యార్థులు సీబీఎస్‌ఈ టెన్త్, ఇంటర్ ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. పదో తరగతిలో ఉన్న 52 మంది, ఇంటర్‌లో న్న 57 మంది మొత్తం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ జయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు.

ఈవీఎంల గదులకు సీల్

కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎన్నికల పరిశీలకులు


చిత్తూరు, జీడీనెల్లూరు అసెంబ్లీ స్ట్రాంగ్‌రూమ్‌లకు సీల్ వేస్తున్న అధికారులు, నగరి నుంచి చిత్తూరుకు ఈవీఎంలను తరలిస్తున్న దృశ్యం

చిత్తూరు కలెక్టరేట్, మే 14: స్థానిక ఎస్వీసెట్ కళాశాలలో ఏర్పాటుచేసిన చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ కౌంటింగ్ కేంద్రాన్ని మంగళవారం ఎన్నికల పరిశీలకులు షాదిక్ అలామ్, కైలాష్ వాంఖ్డే, ఆర్వో, జేసీ శ్రీనివాసులు, కలెక్టర్ షన్మోహన్‌లు పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రం లోపల ఓట్ల లెక్కింపుకోసం ఏర్పాటు చేసిన టేబుల్స్, కౌంటింగ్ సిబ్బంది కూర్చోవడానికి సీటింగ్ అరేంజ్‌మెంట్లు, కౌంటింగ్‌కు అవసరమైన మౌలిక సదుపాయాల గురించి పరిశీలకులు ఆర్వోకు సూచనలు చేశారు. కౌంటింగ్ కేంద్రం లోపల ఏజెంట్లు వేచివుండేందుకు తయారుచేసిన మెష్‌లను వారు పరిశీలించారు. అంతకుముందు చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన 226 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన పోల్డ్ ఈవీఎంలను భద్రపరిచిన గదికి ప్రముఖుల సమక్షంలో సీల్ వేశారు.కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు, జేసీ, కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, ట్రైనీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, ఇతర నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

జీడీనెల్లూరు ఈవీఎంలు స్ట్రాంగ్ రూముల్లో భద్రం

వెదురుకుప్పం: ఎస్వీసెట్‌లో మంగళవారం గంగాధరనెల్లూరు నియోజకవర్గానికి సంబంధించిన పోల్డ్ ఈవీఎంలను స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచి, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సీల్ చేశారు గంగాధరనెల్లూరు ఆర్వో వెంకటశివ పాల్గొన్నారు.

నగరి: నగరి నియోజకవర్గంలోని 231 పోలింగ్ బూత్‌లకు సంబంధించిన ఈవీఎంలను మంగళవారం మధ్యాహ్నం చిత్తూరుకు భారీ బందోబస్తు మధ్య తరలించారు. ఈవీఎంల సేకరణ ఆలస్యం కావడంతో పోలింగు సిబ్బంది నానా తంటాలు పడ్డారు.

స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్

నగరి నియోజకవర్గం ఎన్నికలకు సంబంధించిన స్ట్రాంగ్ రూమ్‌ను కలెక్టర్ షన్మోహన్ మంగళవారం ఉదయం తనిఖీ చేశారు. ఈవీఎంల సేకరణలో రిటర్నింగ్ అధికారి సరియైన చర్యలు చేపట్టలేదని ఎన్నికల సిబ్బంది వాదోపవాదాలకు దిగడంతో స్పందించిన కలెక్టర్ నగరికి మంగళవారం ఉదయం 3గంటలకు వచ్చి ఎన్నికల అధికారిపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు.


జీడీనెల్లూరు పోలింగ్ వివరాలను పరిశీలిస్తున్న సాధారణ పరిశీలకులు, స్ట్రాంగ్‌రూమ్‌కు సీలు వేసిన అనంతరం నిర్ధారణ సంతకం చేస్తున్న కలెక్టర్

జగన్నాథపురంలో సర్పంచ్ ఇంటిపై వైసీపీ మూకల దాడి


సర్పంచ్ ఇంట్లో పగిలిన కిటికీ అద్దాలు, సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న గాలి భానుప్రకాష్, సర్పంచ్‌ను విచారిస్తున్న పోలీసు అధికారులు

విజయపురం, మే 14: మండలంలోని జగన్నాథపురంలో సర్పంచ్ రాణెమ్మనారాయణరాజు ఇంటిపై సోమవారం అర్ధరాత్రి వైసీపీ మూకలు దాడి చేశాయి. పోలీసు కథనం మేరకు ... సోమవారం పోలింగ్ అనంతరం సాయంత్రం 7 గంటల సమయంలో వైసీపీ , టీడీపీ వర్గీయుల మధ్య తేలికపాటి ఘర్షణ జరిగింది. పోలీసులకు సమాచారం అందడంతో ఇరువర్గాలు పరారయ్యారు. అనంతరం అర్ధరాత్రి వైసీపీ వర్గీయులు దుండగులను పోగు చేసుకొని సర్పంచ్ ఇంటిపై రాళ్లతో, పెద్ద కర్రలతో దాడి చేయడంతో కిటికీ అద్దాలు, కారు బ్యాక్‌లైట్ ధ్వంసమయ్యాయి. వెలుపల నిద్రిస్తున్న సర్పంచ్ కుమారుడు జగదీష్‌కు గాయాలు కావడంతో తిరుపతిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న వెంటనే డీఎస్పీ నరసింహమూర్తి, సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐ జయప్ప సంఘటనా స్థలానికి చేరుకొని సర్పంచ్ దంపతులను విచారించారు. విధ్వంసానికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేశామని, త్వరలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు.

గాలి భానుప్రకాష్ పరామర్శ

సర్పంచ్ కుటుంబాన్ని నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పరామర్శించారు. సర్పంచ్ ఇంటిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి చినబాబు, రాష్ట్ర టీడీపీ బీసీసెల్ అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, తెలుగు మహిళా అధ్యక్షురాలు గుణభూషణమ్మ, వందలాది మంది టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

వైసీపీ దాడిలో గాయపడిన వారికి పరామర్శ

బంగారుపాళ్యం, మే 14: ఎన్నికల్లో భాగంగా సోమవారం వైసీపీ దాడిలో గాయపడ్డ టీడీపీ సానుభూతిపరులను మంగళవారం ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్, మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ పరామర్శించారు. తగ్గువారిపల్లె పంచాయతీ 189వ బూత్ వద్ద ఎన్నికలు ముగిసిన తర్వాత అర్ధరాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఆండారెడ్డిపల్లి ఆదిఆంధ్రవాడకు చెందిన బిల్లా హరి, రాము, సతీష్, హరీష్‌ల ఇండ్లపై ఆండారెడ్డిపల్లికి చెందిన వైసీపీ శ్రేణులు కర్రలతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు.ఈ సందర్భంగా మంగళవారం బాధితులను పూతలపట్టు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ టీడీపీకి భారీగా ఓట్లు పడ్డాయనే అక్కసుతోనే తమపై దాడిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో టీడీపీ నాయకులు జయచంద్ర నాయుడు, ధరణి నాయుడు, ఎన్‌ఆర్‌ఐ విక్రమ్, లోకనాథం నాయుడు, కోకా ప్రకాష్ నాయుడు, అమరావతి తదితరులు ఉన్నారు.


గాయపడిన వారిని పరామర్శిస్తున్న మురళీమోహన్

క్షతగాత్రులకు పలువురి పరామర్శ

చిత్తూరు : వైసీపీ అల్లరిమూకల దాడుల్లో గాయపడి చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మంగళవారం చీలాపల్లి సీఎంసీలో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు పరామర్శించారు. సోమవారం ఎన్నికల సందర్భంగా ప్రశాంత్‌నగర్‌లో పోలింగ్ బూత్ వద్ద ఉన్న టీడీపీ ఏజెంట్లు మహేంద్ర, ఈశ్వర్, మణికంఠలను వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అనుచరులు కర్రలతో దాడిచేసి గాయపరిచారు. దీంతో వారు సీఎంసీలో చికిత్స పొందుతుండగా వారిని పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితుల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అలాగే 10వ డివిజన్ ఇన్‌చార్జి శేషాద్రి నాయుడుపై వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానంద రెడ్డి భౌతిక దాడులకు తెగబడ్డారు. మంగళవారం శేషాద్రి నాయుడును లక్ష్మీనగర్‌లోని ఆయన నివాసంలో పరామర్శించి భయభ్రాంతులకు గురికావాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. తిరుమలకండ్రిగలోని తులసీపతి నాయుడు తోపాటు టీడీపీ నేతలను పరామర్శించారు.కార్యక్రమంలో టీడీపీ నేతలు జయచంద్ర నాయుడు, నవీన్ నాయుడు, సుధాకర్ నాయుడు పాల్గొన్నారు.

నేటి నుంచి నైతిక విలువలపై శిక్షణ

గంగవరం, మే 14: స్థానిక కళామందిరంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి విద్యార్థులకు నైతిక విలువలపై ఉచిత వేసవి శిక్షణ తరగతులు బుధవారం నుంచి నిర్వహిస్తామని సంస్థ అధ్యక్షులు తులసీనాథం నాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 11 గంటల వరకు పాఠశాల స్థాయి విద్యార్థులకు కథలు, ఆట పాటలు, పద్యాల ద్వారా నైతిక విలువలపై శిక్షణ ఇస్తామని వెల్లడించారు. పేర్లు నమోదు చేసుకున్న విద్యార్థులు శిక్షణకు హాజరుకావాలని ఆయన కోరారు.

గంగజాతర చాటింపు

కల్లూరు, మే 14: పులిచెర్లలోని గ్రామదేవత గంగమ్మతల్లి, పాళెంలోని జూపల్లి విరూపాక్షమ్మ ఆలయంలో మంగళవారం గంగజాతర చాటింపు నిర్వహించారు. గంగజాతరకు ముందు వచ్చే మంగళవారం గ్రామదేవత ఆలయాల్లో చాటింపు వేడుకలు నిర్వహిస్తారు. ఇందులోభాగంగా ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేకపూజలు చేశారు. మహిళలు అమ్మవారికి పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు.



ట్రాక్టర్‌ను ఢీకొన్న మోటార్‌సైకిల్
ముగ్గురు యువకులకు గాయాలు ● రాణిపేట సీఎంసీకి తరలింపు


ప్రమాద స్థలిలో క్షతగాత్రులు

గంగాధరనెల్లూరు, మే 14: మోటారుసైకిల్ వెళుతున్న ముగ్గురు యువకులు వారికి ముందుగా వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ ముగ్గురు యువకులను తమిళనాడు రాణిపేట సీఎంసీకి తరలించిన ఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. శ్రీరంగరాజుపురం మండలం యు.ఎం.పురం (ఉద్దండ మహారాజపురం) గ్రామానికి చెందిన ఆనందనాయుడు కుమారుడు చంటి (21), ప్రభాకర్ నాయుడు కుమారుడు చందు(19)లు పుత్తూరులో బీటెక్ చదువుతుండగా. ఇదే గ్రామానికి చెందిన గిరి కుమారుడు సోమనాథ్(19) పాండిచ్చేరిలో బీటెక్ చదువుతున్నాడు. వీరు ముగ్గురు కలిసి యు.ఎం.పురం నుంచి ఒకే మోటారు సైకిల్‌లో చిత్తూరుకు వెళ్ళి, తిరిగి స్వగ్రామానికి వస్తూ, చిత్తూరు-పుత్తూరు ప్రధాన రహదారి గంగాధరనెల్లూరు మండలం పెద్దకాల్వ పంచాయతీ ఎల్లమరాజుపల్లె బస్టాప్ సమీపంలో వారికి ముందుగా వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈప్రమాదంలో చంటి, చందు, సోమనాథ్‌లకు తీవ్రగాయాలు కాగా వారిని స్థానికులు చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి వారిని తమిళనాడు రాణిపేట సీఎంసీ ఆసుపత్రికి తరలించారు.

ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో 'ప్రతిభ' విద్యార్థుల సత్తా

చిత్తూరు (సెంట్రల్), మే 14: ఏపీఆర్‌జేసీ రాష్ట్రస్థాయి ప్రవేశ పరీక్షా ఫలితాల్లో స్థానిక 'ప్రతిభ' ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు సత్తా చాటినట్లు కరస్పాండెంట్ యోగానంద్ తెలిపారు. ఎంపీసీ విభాగంలో వీవై జశ్వంత్ 1635 ర్యాంకు సాధించగా, బెశ్వంత్ 2537, వేద ప్రకాష్ 3830, రితిక 4462, కిరణ్ 5887, నవదీప్ 6868, బీపీసీ నందు శృతి 1409, దిషిత్ 2238, స్నేహిత 3375, సీఈసీలో రాజ 734 ర్యాంక సాధించినట్లు తెలిపారు.

అసంపూర్తిగా గ్రామ సచివాలయం



కార్వేటినగరం, మే 14: మండలంలోని ఆర్‌కేవీబీ పేట గ్రామ సచివాలయ భవన నిర్మాణం గత మూడేళ్లుగా పూర్తికాకుండా అసంపూర్తిగా ఉంది. సచివాలయ భవనం గోడలకు సిమెంట్ ప్లాస్టరింగ్ చేయలేదు. కిటికీలకు తలుపులు ఏర్పాటు చేయలేదు.

బంగారమ్మకు విశేష పూజలు



కార్వేటినగరం, మే 14: కార్వేటినగరం గ్రామ దేవత బంగారమ్మ ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారికి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రసాద్ తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉరి వేసుకుని ఆత్మహత్య



బంగారుపాళ్యం, మే 14: పెళ్ళి కాలేదని జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం తుంబకుప్పంలో చోటుచేసుకుంది. ఈ గ్రామానికి చెందిన చంద్రమౌళి కుమారుడు భరత్ కుమార్ ఎలక్ట్రీషియన్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. తనకు పెళ్ళికాలేదని మనస్తాపానికి గురై సోమవారం తన ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మల్లప్ప తెలిపారు.

వడిశాకు తిని వ్యక్తి ఆత్మహత్య



బంగారుపాళ్యం, మే 14: వడిశాకు తిని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం బంగారుపాళ్యం మండలంలో చోటుచేసుకుంది. కాటప్పగారిపల్లె గ్రామానికి చెందిన కన్నయ్య కుమారుడు కృష్ణమూర్తి తాపీమేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఈయన కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతూ ఉండేవాడు. మంగళవారం ఉదయం వడిశాకు తిని అపస్మారక స్థితిలో పడివుండడంతో కుటుంబ సభ్యులు గమనించి చీలాపల్లి సీఎంసీకి తరలించగా చికిత్స పొందుతూ కృష్ణమూర్తి (42) మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వళ్ళెమ్మ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


విజయ్ (ఫైల్‌ఫొటో)

గుడిపాల, మే 14: మండలంలోని కుప్పిగానిపల్లెలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.... కుప్పిగానిపల్లె దళితవాడకు చెందిన యేసుకు మైఖేల్, విజయ్‌లు కుమారులు. మూడ్రోజుల క్రితం మైఖేల్ తన తమ్ముడు విజయ్ ప్రవర్తన సరిగ్గాలేకపోవడంతో మందలించాడు. దీంతో అలిగి నరహరిపేట చెక్‌పోస్టులోని తన అవ్వగారి ఇంటికి వెళ్ళిపోయాడు. దీంతో మంగళవారం అక్కడ ఎవ్వరికీ కనబడకపోవడంతో చుట్టుపక్కల వెతికితే... చెక్‌పోస్టు ఎదురుగా గల అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరివేసుకుని ఉన్నాడు. దీంతో గుడిపాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవారికి మండలం పూజ

సదుం, మే 14: మండలంలోని తాటి గుంట పాళెం పాపి రెడ్డి గారిపల్లెలో వెలసిన గ్రామదేవత ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం మం డలం పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహిం చారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రాత్రి విశేష అలంకరణలతో మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారిని ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సర్పదోష నివారణ పూజలు



రామకుప్పం, మే 14: పట్టణ శివార్లలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం సర్పదోష నివారణ పూజలు జరిగాయి. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. పురోహితులు నాగరాజ శర్మ, కృష్ణమూర్తి, బాలాజీలు భక్తులచే సర్పదోష నివారణ పూజలు చేయించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలు, మజ్జిగ పంపిణీ చేశారు.